తెలుగు దినపత్రిక

# సిరి

People's Voice వార్త పత్రిక

RNI TG TEL/ 26/A0381

29-05-2026

శుక్రవారం హైదరాబాద్

సంపుటి: (volume): 1

సంచిక: (ISSUE): 113

PUBLISHED FROM HYDERABAD పేజీలు-8 వెల:రూ.4 /–



తెలుగు దినపత్రిక

www.siridaily.com

సిరి People's Voice వార్తపత్రిక

RNI:TGTEL/26/A0381

siridailynews@gmail.com

/siridailynews

@siridailynews

epaper.siridaily.com

**విలేకరులు కావలెను**

ఉన్నత ఆశయంతో ముందుకు పోతున్న సిరి దినపత్రిక లో తెలంగాణలోని అన్ని జిల్లా కేంద్రాలకు స్టాఫ్ రిపోర్టర్స్ తో పాటు, అన్ని జిల్లాలోని నియోజకవర్గ కేంద్రాలకు మరియు మండలాలకు విలేకరులు కావలెను.

99897 78881, 7702344303, 9440451575


# రవాణా సేవ వయా ఏజెంట్!

**ఏసీబీ దాడుల్లో వెలుగులోకి వాస్తవాలు**

- 'టిక్కు' పడితే టక్కుమని సంతకం.. లేదంటే కొర్రీలు తప్పవు
- రవాణా శాఖలో కాసులు లేకుండా ఏ పనీ జరగదు
- రిజిస్ట్రేషన్ లోనూ లెక్క తేలాల్సిందే
- హైదరాబాద్‌లోని ఆర్టీఏ ఆఫీసుల పై ఏసీబీ మెరుపు దాడులు
- 17 ఆన్‌లైన్ సేవలను 'ఆఫ్‌లైన్' దోపిడీగా మార్చేసిన అధికారులు
- రాష్ట్రవ్యాప్తంగా జిల్లాల్లోనూ ఇదే దందా
- డ్రైవింగ్ లైసెన్స్ నుంచి పర్మిట్ల వరకు దళారులదే రాజ్యం

**తెలంగాణ బ్యూరో, సిరి న్యూస్:**

ప్రజలకు వ్యయప్రయాసలు లేకుండా, అవినీతికి తావులేని పారదర్శక సేవలు అందించడమే లక్ష్యంగా రవాణా శాఖలో ప్రభుత్వం విప్లవాత్మక మార్పులు తెచ్చింది. సామాన్యుడు ఆర్టీఏ ఆఫీసుల చుట్టూ తిరిగే పనిలేకుండా ఏకంగా 17 రకాల సేవలను ఆన్‌లైన్ చేసింది. వాహనం కొనుగోలు చేసిన షోరూమ్‌లోనే రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయ్యేలా సరికొత్త వెసులుబాటు కల్పించింది. కానీ, క్షేత్రస్థాయిలో రవాణా శాఖ

మిగతా 2వ పేజీలో..




# సర్కారు నిర్ణయాన్ని సమర్థిస్తారా? ప్రజా వ్యతిరేకతకు సై అంటారా?

- 'రైతు డిస్కమ్' ఏర్పాటుపై నేడే టీజీఈఆర్సీ కీలక విచారణ
- తెలంగాణలో మూడో డిస్కమ్ తీవ్ర వివాదం
- జూన్ 2 నుంచే ప్రారంభించాలని పట్టుదల
- వ్యతిరేకిస్తున్న విద్యుత్ ఉద్యోగ సంఘాలు, మేధావులు
- అభిప్రాయ సేకరణలో 95 శాతం వ్యతిరేకత
- ఈఆర్సీ అనుమతి లేకున్నా పాలకవర్గం ఏర్పాటు
- కోర్టుకు వెళ్లకుండా యాజమాన్యం ముందస్తు కేవియట్

TELANGANA RYTHU POWER DISTRIBUTION COMPANY LIMITED TGRPDCL

**తెలంగాణ బ్యూరో, సిరి న్యూస్, మే 28:**

తెలంగాణ విద్యుత్ శాఖలోని పంపిణీ వ్యవస్థను ముక్కలు చేసి, రైతు ప్రయోజనాల కోసమంటూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకువస్తున్న 'రైతు డిస్కమ్' (మూడో డిస్కమ్) ఏర్పాటు వ్యవహారం ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర నిరసనలకు, సందేహాలకు తావిస్తోంది. కళ్లముందే జరుగుతున్న నష్టాలను నిపుణులు వివరిస్తున్నా, మేధావులు హెచ్చరిస్తున్నా.. కొందరు ఉన్నతాధికారులు ప్రభుత్వాన్ని తప్పుదోవ పట్టించి మరీ ఈ కొత్త డిస్కమ్

మిగతా 3వ పేజీలో..



## యూత్ డిక్లరేషన్ పోరులో బీఆర్ఎస్వీ నారాజ్

- మమ్మల్ని పక్కనపెట్టి పోరాటాలు ఎలా చేస్తారని ప్రశ్న
- సరూర్‌నగర్ సభ సన్నాహకాలపై విద్యార్థి విభాగం ఆగ్రహం
- కీలక సమావేశానికి ఆహ్వానం లేకపోవడంపై నేతల అసహనం
- 30న కేటీఆర్ సమావేశానికి తప్పనిసరిగా పిలవాలంటూ డిమాండ్

2

## ప్రజా పాలనలో సౌర క్రాంతి గ్రీన్ ఎనర్జీ హబ్‌గా తెలంగాణ లక్ష్యం

- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

**బోనకల్లు, సిరి న్యూస్**

రాష్ట్రంలో పర్యావరణహిత ఇంధన వనరులను ప్రోత్సహిస్తూ తెలంగాణను గ్రీన్ ఎనర్జీ హబ్‌గా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. ఖమ్మం జిల్లా బోనకల్ మండలం గర్లపాడు గ్రామంలో గురువారం

మిగతా 3వ పేజీలో..





3

## రైతులారా అధైర్యపడకండి

- చివరి గింజ వరకు కొనుగోలు చేస్తాం: మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి భరోసా
- దేశ చరిత్రలోనే రికార్డ్ స్థాయిలో 8,575 కొనుగోలు కేంద్రాలు

## అకాల వర్షాలనూ రాజకీయాల కోసం వాడుకోవద్దు



- అది రైతు గోస కాదు.. బీజేపీ రాజకీయ ఘోష
- బీఆర్ఎస్ డైవర్షన్ పాలి'ట్రిక్స్'
- మంత్రి ఫైర్

2



## దేశానికి ఆదర్శంగా ఫ్యూచర్ సిటీ

- నిర్మాణ పనులను పరిశీలించిన మంత్రులు
- భవిష్యత్ అవసరాల దృష్ట్యా నగర నిర్మాణం
- మంత్రులు పొంగులేటి, శ్రీధర్‌బాబుల వెల్లడి

3

## సివిల్ వర్క్‌లు వేగవంతంగా పూర్తిచేయాలి

- సనత్ నగర్ టిమ్స్ పరిశీలించిన మంత్రి దామోదర్

2






## ఫ్యూచర్ సిటీ భూములకు రికార్డు ధరలు

- రావిర్యాలలో చదరపు గజం భూమి రూ.83,500లు
- విక్రయాల ద్వారా రూ 140 కోట్లు ఆదాయం
- హౌసింగ్ బోర్డు స్థలాలకు భారీ డిమాండ్

3



## తెలంగాణకు చల్లని కబురు

- రెండు రోజుల్లో రుతుపవనాల ఆగమనం

**హైదరాబాద్, మే 28, సిరి న్యూస్:**

తీవ్రమైన ఎండలు, ఉక్కపోతతో అల్లాడిపోతున్న తెలంగాణ ప్రజలకు వాతావరణ శాఖ ఓ చల్లని కబురు అందించింది. ఎప్పుడెప్పుడా

మిగతా 2వ పేజీలో..

## కడియాలు, కమ్మల కోసం కాళ్లు నరికి.. గొంతు కోశారు..!

- చేవెళ్లలో మృగాళ్ల దారుణం... నిర్మానుష్య ప్రాంతంలో విగతజీవిగా మైసమ్మ
- మహిళ ప్రాణాలు తీసిన కిరాతకులు ... మృతురాలు కూలీ పనులు చేసుకునే నిరుపేద

2



## 2ను ఆర్టీసీ అపాయింటెడ్ డేగా ప్రకటించాలి

- ఎంపీలను కలిసి విన్నవించిన జేఏసీ నేతలు
- ఆర్టీసీ విలీనంపై స్పష్టత కోరుతూ 1న ఇందిరాపార్క్ వద్ద దీక్ష

2



# కడియాలు, కమ్మల కోసం కాళ్లు నరికి.. గొంతు కోశారు..!

- మహిళ ప్రాణాలు తీసిన కిరాతకులు
- చేవెళ్లలో మృగాళ్ల దారుణం
- నిర్మానుష్య ప్రాంతంలో విగతజీవిగా మైసమ్మ
- మృతురాలు కూలీ పనులు చేసుకునే నిరుపేద
- ఘటనతో స్థానికుల్లో వ్యక్తమవుతున్న భయాందోళనలు

**తెలంగాణ బ్యూరో, సిరి న్యూస్:**

ఆభరణాలపై పెంచుకున్న అత్యాశ మానవత్వాన్ని పూర్తిగా మింగేసింది. కేవలం కడియాలు, చెవి కమ్మల కోసం ఓ అమాయక మహిళను అత్యంత క్రూరంగా గొంతు కోసి హత్య చేయడమే కాకుండా, ఆమె కాళ్లను నరికేసిన అమానుష ఘటన రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలంలో కలకలం రేపింది. పసిడి, వెండి కోసం ఒక ప్రాణాన్నే బలి తీసుకున్న ఈ దారుణ మృగత్వం స్థానిక సమాజాన్ని తీవ్రంగా కలచివేస్తోంది. మనిషిలో దాగి ఉన్న క్రూరత్వాన్ని వెలికితీసిన ఈ కిరాతక ఘటన చేవెళ్ల పరిసర ప్రాంతాల్లో తీవ్ర భయాందోళనలకు కారణమవుతోంది.

**నిర్మానుష్య ప్రాంతంలో శవమై**

పోలీసులు మరియు స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. చేవెళ్ల మండలంలోని గొల్లపల్లి అనుబంధ గ్రామం ధర్మసాగర్‌కు చెందిన ఎరుకుల మైసమ్మ (48) కొన్నేళ్ల క్రితమే తన భర్తను కోల్పోయింది. అప్పటి నుండి ఆమె కూలీ పనులు చేసుకుంటూ ఒంటరిగా జీవనం సాగిస్తోంది. ఆమె కొడుకు సురేశ్‌కు వివాహం కావడంతో అతను భార్యతో కలిసి వేరే ఇళ్లలో ఉంటున్నాడు. ఈ క్రమంలో మంగళవారం సాయంత్రం వేళ నిత్యం లాగే ఇంటి నుంచి బయటకు వెళ్లిన మైసమ్మ.. రాత్రి దాటినా తిరిగి రాకపోవడంతో, బుధవారం మధ్యాహ్నం ఈర్లపల్లి సమీపంలోని ఒక నిర్మానుష్య ప్రదేశంలో ఆమె మృతదేహం పడి ఉండటాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు.

**50 తులాల వెండి కోసం ఏకంగా కాళ్లే నరికేశారు..**

ఘటనాస్థలికి చేరుకున్న చేవెళ్ల పోలీసులు మృతదేహాన్ని పరిశీలించగా, దుండగులు మైసమ్మను నమ్మించి లేదా బలవంతంగా ఆ నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి, మొదట గొంతు కోసి అత్యంత దారుణంగా హత్య చేసినట్లు తేలింది. అయితే, ఈ హత్య వెనుక ఉన్న అసలు కారణం తెలిశాక పోలీసులతో పాటు స్థానికులు సైతం దిగ్భ్రాంతికి గురయ్యారు. మైసమ్మ కాళ్లకు ఉన్న సుమారు 50 తులాల వెండి కడియాలు తీయడానికి రాకపోవడంతో, ఆ నరరూప రాక్షసులు ఏకంగా ఆమె రెండు కాళ్లను నరికి ఆ కడియాలతో పాటు చెవులకు ఉన్న కమ్మలను కూడా దోచుకెళ్లినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. కేవలం నగలను దొంగిలించాలన్న దుర్బుద్ధితోనే ఈ వికృత చేష్టలకు పాల్పడినట్లు స్పష్టమవుతోంది.

**తాగిన మత్తులోనే దారుణం..**

పక్కా ప్లాన్ ప్రకారమే ఒంటరి మహిళను టార్గెట్ చేసుకుని, తాగిన మత్తులో ఉన్న కొందరు వ్యక్తులు ఈ దారుణానికి ఒడిగట్టి ఉండవచ్చని పోలీసులు ప్రాథమికంగా భావిస్తున్నారు. ఈ ఘోర ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తును వేగవంతం చేసినట్లు చేవెళ్ల సీఐ భూపాల్‌శ్రీధర్ మీడియాకు తెలిపారు. చేవెళ్లలో చోటుచేసుకున్న ఈ దారుణ ఘటన గ్రామీణ ప్రాంతాల ప్రజల్లో సరికొత్త భయాన్ని సృష్టిస్తోంది. కేవలం ఒంటిపై ఉన్న నగలు, కడియాల కోసం ఇంత క్రూరంగా కాళ్లు నరికి చంపేస్తుంటే.. ఇకపై గ్రామాల్లో ఒంటరిగా తిరిగే మహిళలకు రక్షణ ఎక్కడుంటుందని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. పోలీసులు ఇలాంటి అసాంఘిక శక్తులపై గట్టి నిఘా పెట్టి, నిందితులను కఠినంగా శిక్షించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# అకాల వర్షాలనూ రాజకీయాల కోసం వాడుకోవద్దు

**హైదరాబాద్, మే 28, సిరి న్యూస్ :**

అకాల వర్షాలనూ మీ రాజకీయాల కోసం వాడుకోవద్దని ప్రతిపక్షాలకు ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు చురకలంటించారు. పన్నెండేళ్లుగా కేంద్రంలో అధికారంలో ఉండి రైతుల ఆదాయం రెట్టింపు చేయకపోగా ఎరువుల ధరలు పెంచి, నల్ల చట్టాలతో తీవ్ర అన్యాయం చేసిన బీజేపీ.. ఇవాళ తెలంగాణలో రైతు గోసబీజేపీ భరోసా పేరిట పొలిటికల్ యాత్రలు చేస్తోందని గురువారం ఓ ప్రకటనలో విమర్శించారు. అది 'రైతు గోస' కాదని.. అధికారం కోసం బీజేపీ నాయకులు పెడుతున్న 'రాజకీయ ఘోష' అని మండిపడ్డారు. స్వామినాథన్ కమిటీ సిఫారసులను పూర్తి స్థాయిలో అమలు చేయకుండా అన్నదాతలకు అన్యాయం చేస్తున్నదెవరో ముందు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. నాడు తెలంగాణలో పండిన ధాన్యాన్ని కొనుగోలు చేయమని అడగటానికి వెళ్తే మీ వాళ్లకు నూకలు తినటం అలవాటు చేయండంటూ అవమానించిన మీ కేంద్ర మంత్రుల చరిత్రను మర్చిపోయారా అని బీజేపీ నాయకులను మంత్రి శ్రీధర్‌బాబు ప్రశ్నించారు. అప్పట్లో మన రైతుల పక్షాన నిలబడకుండా ఇప్పుడు మొసలి కన్నీరు కారుస్తున్నారా అంటూ ఎద్దేవా చేశారు. నిజంగా రైతులపై ప్రేమ ఉంటే ఇక్కడ పొలిటికల్ టూర్లు చేస్తూ కాలక్షేపం చేయక ఢిల్లీకి వెళ్లి కేంద్రంపై ఒత్తిడి తెచ్చి తెలంగాణ రైతాంగానికి న్యాయంగా రావాల్సిన హక్కులను, నిధుల్ని సాధించుకు రావాలని సూచించారు. ప్రకృతి వైపరీత్యాలు తలెత్తినప్పుడు రైతాంగానికి ధైర్యం చెప్పి బాధ్యతాయుతమైన ప్రతిపక్షంగా అన్నదాతలకు అండగా నిలవాల్సిన బీఆర్ఎస్.. ఆ పని పక్కనబెట్టి కేవలం రాజకీయ ఉనికి కోసం ప్రభుత్వంపై తప్పుడు ప్రచారం చేయడమే లక్ష్యంగా పెట్టుకోవడం సిగ్గుచేటు అని అన్నారు. క్షేత్రస్థాయిలో ప్రభుత్వం పారదర్శకంగా, రికార్డు స్థాయిలో కొనుగోళ్లు జరుపుతుంటే ప్రజల్ని తప్పుదోవ పట్టించేలా డైవర్షన్ పాలి'ట్రిక్స్' చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ప్రతిపక్షాలు ఎన్ని ఆటంకాలు సృష్టించినా, ఎన్ని కుట్రలు చేసినా చివరి గింజ కొనే వరకు అన్నదాతలకు ప్రభుత్వం అండగా ఉంటుందని స్పష్టం చేశారు. బీజేపీ, బీఆర్ఎస్‌ల దుష్ప్రచారాన్ని నమ్మి ఆందోళనకు గురికావద్దని రైతులకు విజ్ఞప్తి చేశారు.

# తెలంగాణకు చల్లని కబురు

**మొదటిపేజీ తరువాయి**

అని ఎదురుచూస్తున్న నైరుతి రుతుపవనాలు చురుగ్గా కదులుతూ రెండు రోజుల్లో రాష్ట్రంలోకి ప్రవేశించనున్నాయని వెల్లడించింది. ఈ రుతుపవనాల ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా వాతావరణం ఒక్కసారిగా చల్లబడటమే కాకుండా రాగల మూడు రోజులపాటు విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. రుతుపవనాలు రాష్ట్రవ్యాప్తంగా పూర్తిగా విస్తరించడానికి ముందు రాబోయే రెండు రోజుల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఉత్తర, తూర్పు తెలంగాణ జిల్లాల్లో వడగాలుల తీవ్రత ఎక్కువగా ఉంటుందని, పగటిపూట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే మరింత ఎక్కువయ్యే ప్రమాదం ఉందని పేర్కొంది. అందువల్ల రుతుపవనాలు పూర్తిగా ప్రవేశించే వరకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఎండ తీవ్రత దృష్ట్యా మధ్యాహ్నం వేళల్లో తగు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచించారు.



# రవాణా సేవ వయా ఏజెంట్!

**మొదటిపేజీ తరువాయి**

అధికారులు మాత్రం ప్రభుత్వ ఆశయాలకు తూట్లు పొడుస్తున్నారు. ఆన్‌లైన్ ఫైలైనా సరే.. అది 'ఏజెంట్' ద్వారా వస్తేనే స్వీకరిస్తూ, దళారుల రాజ్యానికి పెద్దపీట వేస్తున్నారు. తెలంగాణ రవాణా శాఖలో అధికారుల అండతో ఏజెంట్లు సాగిస్తున్న వసూళ్ల పర్వానికి అసలు లెక్కే లేకుండా పోయింది. బుధవారం అవినీతి నిరోధక శాఖ అధికారులు హైదరాబాద్ నగరంలోని పలు రవాణా శాఖ కార్యాలయాలపై ఏకకాలంలో జరిపిన ఆకస్మిక దాడుల్లో ఈ వ్యవస్థీకృత అవినీతి నెట్‌వర్క్ దారుణాలు విస్తుపోయేలా వెలుగులోకి వచ్చాయి.

**ఆన్లైన్ అయినా ఏజెంటే దిక్కు..**

ప్రజలు కార్యాలయాలకు రాకుండానే ఇంటి నుంచే ఆన్‌లైన్‌లో సేవలు పొందేందుకు ప్రభుత్వం అనుమతులిచ్చినా, ఆర్టీఏ అధికారులు మాత్రం దాన్ని సామాన్యుడికి శాపంగా మార్చారు. ఒక సామాన్య పౌరుడు ల్యాప్‌టాప్ ముందో, మీసేవ కేంద్రంలోనో నేరుగా దరఖాస్తు చేసుకుంటే ఆ ఫైలును అధికారులు అస్సలు ముందుకు కదపరు. అదే దరఖాస్తు ఏజెంట్ లాగిన్ నుంచో లేదా ఏజెంట్ ద్వారా ఆఫీసుకు చేరితేనే దానికి మోక్షం లభిస్తుంది. ప్రజలు నేరుగా ఇచ్చే దరఖాస్తుల్లో సాంకేతిక లోపాలున్నాయంటూ, అడ్రస్ ప్రూఫ్ సరిగ్గా లేదంటూ ఏదో ఒక చిన్న కొర్రీ చూపి రిజెక్ట్ చేయడం ఇక్కడి అధికారులకు అలవాటుగా మారింది. అదే ఏజెంట్‌ను సంప్రదిస్తే చాలు.. ఎలాంటి పత్రాలు లేకపోయినా పని నిమిషాల్లో అయిపోతుండటం ఈ శాఖలో అవినీతి ఏ స్థాయిలో వేళ్లూనుకుందో అర్థం చేసుకోవచ్చు.

**టిక్కు ఉంటేనే సంతకం..**

రవాణా శాఖ కార్యాలయాల్లో 'టిక్కు' కథ ఎవరిని కదిలించినా చెబుతారు. రాష్ట్రంలోని ఏ ఆర్టీఏ ఆఫీసుకైనా వెళ్లండి.. అక్కడ పని కావాలంటే ఖచ్చితంగా ఎవరో ఒక ఏజెంట్‌ను ఆశ్రయించాల్సిందే. ప్రభుత్వానికి కట్టే అసలు ఫీజు కంటే ఈ ఏజెంట్లకు ఇచ్చే లంచం మొత్తమే రెట్టింపు ఉంటుంది. అయితే, ఏజెంట్‌కు కాసులు చెల్లించగానే, వారు సదరు దరఖాస్తు ఫైలుపై ఒక ప్రత్యేకమైన పెన్నుతోనో లేదా నిర్దేశిత శైలిలోనో ఒక 'కోడింగ్ టిక్కు' పెడతారు. ఆ టిక్కుకు ఉన్న పవర్ అంతా ఇంతా కాదు. ఆ మార్క్ చూడగానే లోపల ఉన్న అధికారులు ఫైలులోని వివరాలను కనీసం చదవను కూడా చదవరు.. ఠక్కుమని సంతకం పెట్టేస్తారు. ఎందుకంటే ఆ 'టిక్కు' సదరు ఏజెంట్ నుంచి అధికారులకు అందాల్సిన మామూళ్ల వాటా అందిందనడానికి సంకేతం. ఆ టిక్కే అధికారుల సంతకానికి అసలైన 'కిక్కు' ఇస్తుందని బాధితులు బహిరంగంగానే ఆరోపిస్తున్నారు.

**ఏసీబీ దాడుల్లో వెలుగులోకి కొత్త కోణాలు**

కేవలం సాధారణ డ్రైవింగ్ లైసెన్సులు, యాజమాన్య బదిలీల (టీఓ) దందాయే కాకుండా, అంతకుమించిన భారీ ఆర్థిక లావాదేవీలపై ఏసీబీ దాడుల్లో కొత్త కోణాలు బయటపడ్డాయి. రవాణా శాఖ అధికారులు పెద్ద పెద్ద కమర్షియల్ వాహనాలు, లారీలు, ప్రైవేట్ ట్రావెల్స్ బస్సుల టాక్స్ (పన్ను) విధానంలో జరిగే లూప్‌హోల్‌స్‌ను ఆసరాగా చేసుకుని పక్కా స్కెచ్‌తో దోపిడీకి తెరలేపినట్లు ఏసీబీ దర్యాప్తులో తేలింది. తక్కువ టాక్స్ వేయడం, పన్ను మినహాయింపులు ఇవ్వడం, ఫిట్‌నెస్ సర్టిఫికెట్ల మంజూరు వంటి కీలక వ్యవహారాల్లో ఏజెంట్ల ద్వారా లక్షల రూపాయల ముడుపులు అధికారుల చేతులు మారినట్లు నిర్ధారణ అయ్యింది. కేవలం మూడు ప్రధాన రవాణా శాఖ కార్యాలయాల్లో జరిపిన సోదాల్లోనే ఇంతటి భారీ అక్రమాలు లభ్యం కావడంతో.. ఈ శాఖ మొత్తం అవినీతి కూపంలో కూరుకుపోయిందని స్పష్టమవుతోంది.

**రాష్ట్రమంతటా ఇదే తీరు..**

హైదరాబాద్ మహానగరంలోనే కాకుండా తెలంగాణలోని అన్ని జిల్లాల రవాణా శాఖ కార్యాలయాల్లోనూ ఇదే దారుణమైన తీరు నిరంతరాయంగా కొనసాగుతోంది. కొత్తగా మోటార్ సైకిల్ కొన్నా, కారు కొన్నా షోరూమ్ రిజిస్ట్రేషన్ల వెనుక కూడా అధికారుల పర్సంటేజీల లెక్కలు తేలాల్సిందేనని సమాచారం. లెర్నింగ్ లైసెన్స్, పర్మినెంట్ డ్రైవింగ్ లైసెన్స్, వాహనాల రెన్యూవల్, క్వార్టర్లీ టాక్స్ చెల్లింపులు, పర్మిట్ల మంజూరు.. ఇలా ఏ సేవ కావాలన్నా 'ఓన్లీ వయా ఏజెంట్' అనే అలిఖిత నిబంధన అమలవుతోంది. ప్రభుత్వం ఆన్‌లైన్ సేవలను ఎంతగా ప్రచారం చేసినా, క్షేత్రస్థాయిలో దళారులను దాటుకుని సామాన్యుడు నేరుగా పని ముగించుకునే పరిస్థితి లేకపోవడం గమనార్హం. ఏసీబీ దాడుల నేపథ్యంలోనైనా ఉన్నతాధికారులు స్పందించి, ఆన్‌లైన్ దరఖాస్తులను తిరస్కరించే అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఏజెంట్ల ప్రమేయం లేకుండా ఆర్టీఏ సేవలు అందేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

**ఏజెంట్స్ ద్వారానే అన్నీ జరుగుతున్నాయి : ఏసీబీ డీఎస్పీ ఆనంద్**

రవాణా శాఖలో ఏజెంట్ల ద్వారానే అన్ని జరుగుతున్నాయని ఏసీబీ డీఎస్పీ స్వయంగా చెప్పడం చూస్తే రవాణా శాఖలో ఎంత మేర అవినీతి జరుగుతుందో అర్థం చేసుకోవచ్చు.నాగోల్ లో ఏజెంట్స్ తో వస్తేనే లైసెన్స్ వస్తుందని ప్రజలు ఫిర్యాదు చేశారన్నారు. అటు కొండాపూర్, పెట్ బషీరాబాద్ లోను అదే పరిస్థితి నెలకొంది. ఇది రాష్ట్రమంతటా నడుస్తున్న వ్యవహారం.

# 2ను ఆర్టీసీ అపాయింటెడ్ డేగా ప్రకటించాలి

- ఎంపీలను కలిసి విన్నవించిన జేఏసీ నేతలు
- ఆర్టీసీ విలీనంపై స్పష్టత కోరుతూ 1న ఇందిరాపార్క్ వద్ద దీక్ష
- తెలంగాణ జాతీయ మజ్దూర్ యూనియన్ ప్రకటన

**హైదరాబాద్, మే 28, సిరి న్యూస్:**



ఆర్టీసీ ఎన్నికల కంటే ముందుగానే జూన్ 2న విలీనం అపాయింటెడ్ డేట్‌ను ప్రభుత్వం ప్రకటించాలని టీజీఎస్ ఆర్టీసీ జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రాజకీయ ప్రధాన సలహాదారు, ఎంపీ వేం నరేందర్ రెడ్డిని, ఎంపీ రఘురామ్‌రెడ్డిని జేఏసీ నాయకులు గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జేఏసీ చైర్మన్ ఈదురు వెంకన్న, వైస్ చైర్మన్ థామస్ రెడ్డి మాట్లాడుతూ ఆర్టీసీలో గుర్తింపు ఎన్నికలు జరిగిన తరువాతనే విలీనం పక్రియను ప్రారంభిస్తామని రవాణా శాఖ మంత్రి ఇటీవల వెల్లడించడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. రిటైర్డ్ ఉద్యోగుల బకాయిలను చెల్లించడానికి ప్రభుత్వం తగిన నిధులను విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ ఎండీ మౌలానా, కో కన్వీనర్ కత్తుల యాదయ్య, కో కన్వీనర్లు సుద్దాల సురేష్, యాదగిరి, బాబు, బుద్ధ విశాల్, రవికిరణ్ పాల్గొన్నారు. ఇదిలా వుంటే ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేస్తున్నట్లు అపాయింటెడ్ డే ప్రకటించాలని తెలంగాణ జాతీయ మజ్దూర్ య□నియన్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు జూన్ 1న ఇందిరా పార్క్ వద్ద సామూహిక దీక్ష నిర్వహించనున్నట్లు ప్రకటించారు. అత్యవసర సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. య□నియన్ ఎన్నికలకు ముందుగా ఉద్యోగుల పక్రియ పూర్తిచేయాలని, 2026 మే 1 నుంచి అపాయింటెడ్ డే ప్రకటించాలని టీజేఎంయూ నాయకులు డిమాండ్ చేశారు. అపాయింటెడ్ డే కంటే ముందుగా యూనియన్ ఎన్నికలు నిర్వహిస్తామని రవాణా శాఖ మంత్రి ప్రకటించడంతో ఉద్యోగుల్లో అయోమయం నెలకొందని అభిప్రాయపడ్డారు. జూన్ 1న ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఇందిరాపార్కు వద్ద దీక్ష నిర్వహించనున్నట్లు టీజేఎంయూ వ్యవస్థాపక రాష్ట్రకార్యదర్శి హనుమంతు ముదిరాజ్ తెలిపారు. ప్రభుత్వంలో విలీనం కోరుకునే ఉద్యోగులంతా యూనియన్లకు అతీతంగా ఈ దీక్షలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ దీక్షకు తెలంగాణ ఆర్టీసీ కార్మిక సమాఖ్య కూడా మద్దతు ప్రకటించింది. యాజమాన్యం వద్ద పరిష్కారం కావాల్సిన 29 సమస్యలపై చర్చలు కొనసాగుతున్న సమయంలో ఎన్నికలకు వెళ్లడం వల్ల కార్మికులు నష్టపోతారని కార్మిక సమాఖ్య నాయకుడు కె.రాజిరెడ్డి తెలిపారు. విలీనం అనంతరం యూనియన్లు కొనసాగితే ఎన్నికల అంశాన్ని పరిశీలించాలన్నారు. విలీనానికి సంబంధించిన విధివిధానాలు రూపొందించే కమిటీలో ప్రతి యూనియన్‌కు ప్రాతినిధ్యం కల్పించాలని కోరారు. అపాయింటెడ్ డే ప్రకటించే వరకు తమ పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

# సివిల్ వర్కులు వేగవంతంగా పూర్తిచేయాలి

**హైదరాబాద్, మే 28, సిరి న్యూస్:**



అంతర్జాతీయ స్థాయిలో ఏర్పాటు చేసిన సనత్‌నగర్ టిమ్స్ హాస్పిటల్‌లో చేపట్టిన సివిల్ వర్క్‌లను శరవేగంగా పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులను వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశించారు. హాస్పిటల్‌లో ఆధునిక పరికరాలు, వైద్య సదుపాయాలు, ఇన్‌ఫ్రా□, ల్యాబొరేటరీ, బ్లడ్ బ్యాంకులను గురువారం పరిశీలించారు. ఆస్పత్రి ప్రాంగణంలో డాక్టర్లకు విడివిడిగా బాయ్స్, గర్ల్స్ హాస్టల్ బ్లాక్‌లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఔట్ పేషంట్, ఇన్ పేషంట్‌ల అవసరమైన టాయిలెట్ బ్లాక్స్‌ను ఏర్పాటు చేయాలన్నారు. హాస్పిటల్ ప్రాంగణంలో ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా మల్టీ లెవెల్ పార్కింగ్ సిస్టంను అభివృద్ధి చేయాలని, రోగుల సహాయకుల కోసం ధర్మశాల, హాస్పిటల్‌లో రెండు క్యాంటీన్‌లను ఏర్పాటు చేయాలని, పరిపాలన భవనం, టీబీ హాస్పిటల్ బోర్డు ఆఫీసు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, ప్రధాన ద్వారంలో పోలీస్ అవుట్ పోస్టును ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. అంతర్జాతీయ స్థాయిలో నిర్మిస్తున్న హాస్పిటల్‌లో డ్రైనేజీ, శానిటేషన్ నిర్వహణ, వాటర్ సప్లై వంటి సేవలు నిరంతరం కొనసాగేలా చర్యలు చేపట్టాలన్నారు. ఆస్పత్రిలో అధునాతన ఇంటీరియర్, లాంజ్‌లను ఏర్పాటు చేయాలన్నారు. విదేశీ రోగుల కోసం ఏర్పాటు చేసిన బ్లాక్స్‌లో ఆధునిక సౌకర్యాలకు పెద్దపీట వేయాలని సూచించారు. అంతర్జాతీయ స్థాయి లేబరేటరీ ఏర్పాటుపై డీఎంఈ, హెచ్‌వోడీ, వైద్య మౌలిక సదుపాయాల కల్పన సంస్థ ఇంజనీరింగ్ అధికారులతో కమిటీని మంత్రి ఏర్పాటు చేశారు. టిమ్స్ పూర్తిస్థాయిలో ప్రారంభించేందుకు అవసరమైన కొనసాగింపు పనులు పూర్తి చేసేందుకు అంచనాలను రూపొందించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. అనంతరం ప్రతిపాదిత పరిపాలన భవనంలో ఆస్పత్రి నిర్వహణ, మెరుగైన వైద్య సేవల కల్పన, సివిల్ వర్క్‌స్‌ను శరవేగంగా పూర్తి చేయడంపై సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ లక్ష్యాలు, హాస్పిటల్ నిర్వహణ, మెరుగైన వైద్య సేవల కల్పనపై వైద్య, ఆరోగ్యశాఖ అధికారులకు మంత్రి దిశా నిర్దేశనం చేశారు. మంత్రి వెంట వైద్య ఆరోగ్య ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి డాక్టర్ క్రిస్టినా జెడ్ చొంగ్తు, రాష్ట్ర మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ నరేంద్ర కుమార్, తెలంగాణ వైద్య, మౌలిక సదుపాయాల కల్పన సంస్థ ఎండీ హనుమంతు, నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ బీరప్ప, ఆర్ అండ్ బి శాఖ ఇంజనీరింగ్ అధికారులు ఉన్నారు.

# యూత్ డిక్లరేషన్ పోరులో బీఆర్ఎస్వీ నారాజ్

**తెలంగాణ బ్యూరో, మే 28, సిరి న్యూస్**

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వంపై పోరాటాలను ఉద్ధృతం చేయాలని భావిస్తున్న బీఆర్ఎస్‌లో అంతర్గత అసంతృప్తి బయటపడుతోంది. ముఖ్యంగా యూత్ డిక్లరేషన్ అమలు డిమాండ్‌తో చేపట్టనున్న ఉద్యమంలో తమకు ప్రాధాన్యం ఇవ్వడం లేదంటూ పార్టీ విద్యార్థి విభాగం బీఆర్ఎస్వీ నేతలు అసహనం వ్యక్తం చేస్తున్నట్టు సమాచారం. విద్యార్థులు, నిరుద్యోగుల సమస్యలపై జరిగే పోరాటంలో తమను పక్కనపెట్టడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. రాష్ట్రంలో ప్రతిపక్షంలోకి వచ్చిన తర్వాత ప్రజా సమస్యలపై ఉద్యమాలను వేగవంతం చేయాలని బీఆర్ఎస్ అధిష్టానం నిర్ణయించింది. ఇప్పటికే రైతు డిక్లరేషన్ అమలు డిమాండ్‌తో నిర్వహించిన సభ విజయవంతమైందని భావిస్తున్న పార్టీ నేతలు ఇప్పుడు కాంగ్రెస్ ప్రకటించిన యూత్ డిక్లరేషన్ అంశాన్ని ముందుకు తీసుకొస్తున్నారు. ఎన్నికల ముందు సరూర్‌నగర్‌లో కాంగ్రెస్ ప్రకటించిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ "చలో సరూర్‌నగర్" పేరుతో భారీ బహిరంగ సభ నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

నిరుద్యోగ భృతి, ఉద్యోగాల భర్తీ, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని బీఆర్ఎస్ ఆరోపిస్తోంది. ఈ అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు పాత జీహెచ్ఎంసీ పరిధిలోని గులాబీ ఎమ్మెల్యేలు ఇటీవల సమావేశమై కార్యాచరణపై చర్చించారు. అనంతరం మీడియా సమావేశం నిర్వహించి పోరాట కార్యాచరణను ప్రకటించారు.

అయితే ఈ సమావేశానికి తమను ఆహ్వానించకపోవడంపై బీఆర్ఎస్వీ నాయకులు తీవ్ర అసంతృప్తితో ఉన్నట్టు తెలుస్తోంది. యూత్ డిక్లరేషన్ ప్రధానంగా విద్యార్థులు, నిరుద్యోగులకు సంబంధించిన అంశమని, అలాంటి సమావేశంలో విద్యార్థి విభాగం నేతలకు చోటు లేకపోవడం అవమానకరమని భావిస్తున్నారట. పార్టీ చేపట్టే ప్రతి ఉద్యమంలో ముందుండేది విద్యార్థి విభాగమేనని, ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటాలు చేస్తూ ఇప్పటికే అనేక కేసులు ఎదుర్కొంటున్నామని గుర్తుచేస్తున్నారు. పార్టీకి అవసరమైనప్పుడు ఉద్యమాలకు పంపించి, కీలక నిర్ణయాల సమయంలో మాత్రం దూరం పెడుతున్నారనే భావన విద్యార్థి నేతల్లో వ్యక్తమవుతోందని సమాచారం. కనీసం మీడియా సమావేశానికైనా పిలిచి ఉంటే బాగుండేదని వారు అభిప్రాయపడుతున్నట్టు తెలిసింది. మరోవైపు ఇది యూత్ డిక్లరేషన్‌కు సంబంధించిన అంశం కావడంతో పార్టీ యువజన విభాగానికే ప్రాధాన్యం ఇచ్చామని కొందరు ఎమ్మెల్యేలు వివరణ ఇస్తున్నారు. విద్యార్థి విభాగానికి చెందిన కొందరు నేతలను సంప్రదించే ప్రయత్నం చేసినప్పటికీ అందుబాటులో లేరని చెబుతున్నారు. అయితే ఈనెల 30న కేటీఆర్ సమక్షంలో జరిగే సన్నాహక సమావేశానికి తమను తప్పనిసరిగా ఆహ్వానించాలని బీఆర్ఎస్వీ నేతలు డిమాండ్ చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై జరిగే ఉద్యమాల్లో విద్యార్థి విభాగమే ముందుంటుందని, తమకు సమాచారం ఇవ్వకుండా కార్యక్రమాలు నిర్వహించడం బాధాకరమని వారు అంటున్నారు.

## ప్రజా పాలనలో సౌర క్రాంతి
## గ్రీన్ ఎనర్జీ హబ్‌గా తెలంగాణ లక్ష్యం

**మొదటిపేజీ తరువాయి**

ఆయన సోలార్ ప్రాజెక్టులను ప్రారంభించి మాట్లాడారు. బోనకల్, కొడంగల్ మండలాలను రాష్ట్రంలో తొలి సంపూర్ణ సోలరైజేషన్ మండలాలుగా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. రైతుల పొలాల్లో ఏర్పాటు చేస్తున్న సోలార్ పంపుసెట్లు సాగునీటితో పాటు మిగులు విద్యుత్ ద్వారా అదనపు ఆదాయం అందిస్తాయని చెప్పారు. ఇళ్లపై సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు వల్ల కరెంటు ఖర్చు తగ్గడంతో పాటు నెలకు రూ.500 వరకు ఆదాయం వచ్చే అవకాశం ఉందన్నారు.

రాష్ట్రంలో 81 గ్రామాలను మోడల్ సోలార్ గ్రామాలుగా అభివృద్ధి చేస్తున్నామని, మహిళా సంఘాల ద్వారా సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేసి వారిని ఆర్థికంగా బలోపేతం చేస్తున్నామని తెలిపారు. ప్రతి జిల్లాలో ఇందిరా మహిళా శక్తి సంఘాలకు 2 వేల మెగావాట్ల సోలార్ విద్యుత్ అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు.

రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ 18,542 మెగావాట్లకు పెరిగినా ఎక్కడా అంతరాయం లేకుండా ప్రభుత్వం నాణ్యమైన విద్యుత్ అందిస్తోందని భట్టి చెప్పారు. ట్రాన్స్‌మిషన్ వ్యవస్థ బలోపేతం, కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు, అదనపు విద్యుత్ ఉత్పత్తితో సమస్యలు రాకుండా చర్యలు తీసుకున్నామని వివరించారు.

అకాల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కనీస మద్దతు ధరతో కొనుగోలు చేస్తుందని డిప్యూటీ సీఎం స్పష్టం చేశారు. రైతుల కన్నీళ్లు తుడవడమే ప్రజా ప్రభుత్వ ధ్యేయమన్నారు. మొక్కజొన్న కొనుగోళ్ల కోసం రూ.5 వేల కోట్లు విడుదల చేశామని తెలిపారు.

ప్రభుత్వంపై తప్పుడు ప్రచారం చేస్తున్న ప్రతిపక్షాలు వాస్తవాలు గుర్తించాలని భట్టి సూచించారు. హరీష్ రావు కట్టుకథలు మానుకోవాలని హితవు పలికారు. బీఆర్ఎస్ పదేళ్లలో చేసిన కొనుగోళ్లతో సమానంగా కాంగ్రెస్ ప్రభుత్వం రెండున్నరేళ్లలో ధాన్యం కొనుగోలు చేసిందని తెలిపారు.

కేంద్ర ప్రభుత్వం తెలంగాణ సేకరించిన ప్రతి గింజ ధాన్యాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రం వైఖరి మార్చుకోకపోతే రైతులు పెద్ద ఎత్తున ఉద్యమిస్తారని హెచ్చరించారు. రైతులకు ఉచిత విద్యుత్, బోనస్‌తో మద్దతు ధర అందిస్తూ వ్యవసాయాన్ని పండగలా మార్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని భట్టి విక్రమార్క తెలిపారు.

## ఫ్యూచర్ సిటీ భూములకు రికార్డు ధరలు

**హైదరాబాద్, మే 28, సిరి న్యూస్ :**

రాజధాని క్యూర్ పరిధిలో పెద్దపెద్ద వెంచర్లు చేపట్టడానికి అనువుగా ఉన్న భూములకు భారీగా డిమాండ్ పెరుగుతోంది. అందులోనూ ఎలాంటి వివాదాలు లేకుండా క్లియర్ టైటిల్‌తో ప్రభుత్వానికి చెందిన హౌసింగ్ బోర్డు స్థలాలకు డిమాండ్ మరింత భారీగా ఉంటోంది. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం ఫ్యూచర్ సిటీ ఎంట్రన్స్‌లో ఎయిర్‌పోర్టుకు సమీపంలోని రావిర్యాలలో భూములను కొనుగోలు చేయడానికి అనేకమంది పోటీపడ్డారు. ఈ ప్రాంతలో ఉన్న హౌసింగ్ బోర్డు భూములకు గురువారం ఇవేలం నిర్వహించారు. మొత్తం నాలుగు భూమలకు నిర్వహించిన వేలంపాటలో చదరపు గజం భూమి గరిష్టంగా రూ.83, 500కు అమ్ముడుపోయిందని హౌసింగ్ బోర్డు వైస్ చైర్మన్ వి.పి.గౌతం తెలిపారు. వెయ్యినుంచి 13,500 చదరపు గజాల విస్తీర్ణంలో ఉన్న నాలుగు లాండ్ పార్సిళ్లకు నిర్వహించిన వేలం పాట ద్వారా సుమారు రూ.140 కోట్ల ఆదాయం వచ్చిందని తెలిపారు. ఈ భూములను ఇఆక్షన్‌లో విక్రయిస్తున్నట్లు గత నెలలో హౌసింగ్ బోర్డు ప్రకటన ఇచ్చింది. ఈ భూములను కొనుగోలు చేయడానికి సుమారు 17 సంస్థలు పోటీ పడ్డాయి. ఇందులో 1113 చదరపు గజాల విస్తీర్ణంలో ఉన్న భూమిని కొనుగోలు చేయడానికి బిడ్డర్లు పోటీ పడ్డారు. రూ.26 వేల కనీస ధరను నిర్ధారించగా దీనిని దక్కించుకోడానికి పోటీపడుతూ చదరపు గజం రూ.83,500కు ఒక డెవలపర్ సంస్థ దక్కించుకుంది. అలాగే ఇదే ప్రాంతంలోని సుమారు ఆరు వేల చదరపు గజాల విస్తీర్ణంలోని భూమి వేలం పాటలో చదరపు గజం రూ.62,500 ధరకు అమ్ముడుపోయింది. అంతేకాక సుమారు 13,500 చదరపు గజాల విస్తీర్ణంలోని భూమిని కొనుగోలు చేయడానికి కూడా బిడ్డర్లు పోటీ పడ్డారు. ఈ నాలుగు భూముల వేలం ద్వారా హౌసింగ్ బోర్డుకు సుమారు రూ.140 కోట్ల మేర ఆదాయం వచ్చింది.

**నేడు కూడా భూముల విక్రయాలు**

కేపీహెచ్‌బి కాలనీ, కుత్భుల్లాపూర్ చింతల్ ప్రాంతాల్లోని మరో నాలుగు ప్లాట్లకు (భూములకు) శుక్రవారం ఇఆక్షన్ నిర్వహిస్తున్నారు. కేపీహెచ్‌బి కాలనీ ఫేజ్ 12లోని 5,898 చదరపు గజాలు, 2,420 చదరపు గజాల్లోని ప్లాట్ నెం 2, కుత్భుల్లాపూర్ చింతల్‌లోని 10,890 చదరపు గజాలు, 3,388 చదరపు గజాల భూములను వేలం ద్వారా విక్రయించనున్నారు.

## సరికొత్త చరిత్ర... రాయదుర్గంలో ఎకరా రూ.237 కోట్లు!

- **జీఐఐసీ వేలంలో రికార్డు ధర పలికిన ధర**
- **పాన్ మక్తాలోని సర్వే నెంబర్‌లోని 6 ఎకరాల 29 గుంటలకు వేలం**
- **వేలంలో భూమిని దక్కించుకున్న గౌర వెంచర్స్**

**తెలంగాణ బ్యూరో, మే 28, సిరి న్యూస్:**

హైదరాబాద్ నగరంలో భూమి మరోసారి రికార్డు ధర పలికింది. టీజీఐఐసీ వేలంలో ఎకరా భూమి రూ.237 కోట్లు పలికి సరికొత్త రికార్డును సృష్టించింది. రాయదుర్గంలోని పాన్ మక్తాలోని సర్వే నెంబర్ 83/1లో 6 ఎకరాల 29 గుంటలకు వేలం వేశారు. ఈ క్రమంలో టీజీఐఐసీ భూముల వేలానికి అనూహ్య స్పందన లభించింది. ఈ వేలంలో భూమిని గౌర వెంచర్స్ దక్కించుకుంది. గత సంవత్సరం అక్టోబర్ నెలలో ఇదే ప్రాంతంలో ఎకరం ధర రూ.177 కోట్లు పలికిన విషయం తెలిసిందే. ఆరోజు 7 ఎకరాలకు రూ.1,357.59 కోట్లు వచ్చింది.

టీజీఐఐసీ వేలం వేసే భూములు మంచి డిమాండ్ ఉంటోంది. సర్వే నెంబర్ 83/1లోని ప్లాట్ 1ఏ, 1ఎఫ్‌లోని 6.29 ఎకరాలు, ప్లాట్ నెంబర్ పీ4లోని 5.09 ఎకరాలు సహా మొత్తం 11.38 ఎకరాల భూమి వేలానికి నోటిఫికేషన్ వచ్చింది. ఎకరాకు రూ.139 కోట్ల ధరను నిర్ధారించారు. ఈ వేలం ద్వారా రూ.2 వేల కోట్లకు పైగా ఆదాయం వస్తుందని టీజీఐఐసీ అంచనా వేస్తోంది. ప్లాట్ నెంబర్ పీ4లోని భూములకు జూన్ 1న ఆన్ లైన్ లో వేలం నిర్వహించనున్నారు.

## జడ్చర్ల వద్ద అర్ధరాత్రి రెండు బస్సుల ఢీ

**మహబూబ్‌నగర్, మే 28, సిరి న్యూస్:**

మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల సమీపంలో 44వ జాతీయ రహదారిపై బుధవారం అర్ధరాత్రి ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. హైదరాబాద్ నుంచి తిరుపతి వెళ్తున్న ఓ ప్రైవేట్ బస్సును బెంగుళూరు వైపు వెళ్తున్న మరో ట్రావెల్స్ బస్సు బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఒకరు మృతిచెందగా, మరో 14 మంది ప్రయాణికులు గాయపడ్డారు. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు, పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వారిని వెంటనే జడ్చర్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బస్సు డ్రైవర్‌కి తీవ్ర గాయాలు కావడంతో ఆయన పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. ప్రమాదంలో మృతిచెందిన వ్యక్తిని తిరుపతి రిటైర్డ్ డీఎస్పీ సాంబశి వారెడ్డి కుమారుడు అశోక్ రెడ్డిగా గుర్తించారు. అశోక్ రెడ్డి మృతి వార్తతో కుటుంబ సభ్యులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. ఈ ప్రమాదానికి అధిక వేగం, డ్రైవర్ నిర్లక్ష్యమే కారణమై ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. ప్రమాదం కారణంగా కాసేపు జాతీయ రహదారిపై ట్రాఫిక్ అంతరాయం ఏర్పడగా పోలీసులు వాహనాలను మళ్లించి పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు.

## సర్కారు నిర్ణయాన్ని సమర్థిస్తారా?
# ప్రజా వ్యతిరేకతకు సై అంటారా?

**మొదటిపేజీ తరువాయి**

ఏర్పాటుకు పావులు కదుపుతున్నారు. ఈ నేపథ్యంలో తెలంగాణ విద్యుత్ రెగ్యులేటరీ కమిషన్ నేడు నిర్వహించబోయే బహిరంగ విచారణ అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది. ప్రజాభిప్రాయాన్ని గౌరవించి ఈఆర్‌సీ స్వతంత్రంగా నిర్ణయం తీసుకుంటుందా? లేక ప్రభుత్వ పెద్దల ఒత్తిళ్లకు తలొగ్గి లైసెన్స్ జారీ చేస్తుందా? అనే ఉత్కంఠ సర్వత్రా నెలకొంది.

95 శాతం మంది వ్యతిరేకత.. మూడో డిస్కమ్ ఏర్పాటుపై తెలంగాణ విద్యుత్ రెగ్యులేటరీ కమిషన్ (టీజీఈఆర్‌సీ) సలహాలు, అభిప్రాయాలు కోరుతూ గతంలో బహిరంగ ప్రకటన విడుదల చేసింది. ఈ నెల 18వ తేదీ నాటికి ఈఆర్‌సీకి మొత్తం 32 సంస్థలు, విభిన్న వర్గాల ప్రముఖుల నుండి లేఖలు అందగా.. అందులో దాదాపు 90 నుండి 95 శాతం మంది మూడో డిస్కమ్ ఏర్పాటును తీవ్రంగా వ్యతిరేకించినట్లు విశ్వసనీయ సమాచారం. మెజారిటీ వర్గాల నుండి ఇంతటి వ్యతిరేకత వ్యక్తమైన సమయంలో, ప్రజాభిప్రాయాన్ని బేఖాతరు చేస్తూ రైతు డిస్కమ్‌కు అనుమతులు ఇచ్చి లైసెన్స్ జారీ చేస్తే, కమిషన్ తన స్వయంప్రతిపత్తిని కోల్పోయిందనే అపవాదును మూటగట్టుకోవాల్సి వస్తుందని ఈఆర్‌సీ భావిస్తున్నట్లు తెలుస్తోంది. నేటి విచారణలో ఫిర్యాదుదారుల వాదనలు విన్న తర్వాతే కమిషన్ తన తుది నిర్ణయాన్ని వెల్లడించనుంది.

**అనుమతి లేకముందే ఆరంభం..**

ప్రస్తుతం ఉన్న రెండు డిస్కమ్‌ల (టీజీఎస్పీడీసీఎల్, టీజీఎన్‌పీడీసీఎల్) పరిధిలో ఉన్న వ్యవసాయం, ఎత్తిపోతల పథకాలు, మిషన్ భగీరథ, మున్సిపల్ నీటి సరఫరా వంటి విభాగాలకు చెందిన సుమారు 29.08 లక్షల కనెక్షన్లను వేరు చేసి ఈ కొత్త డిస్కమ్‌ను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం... భావిస్తోంది. అయితే, ఈ విభజన వల్ల అటు ప్రభుత్వానికి, ఇటు విద్యుత్ సంస్థలకు లేదా రైతులకు ఏ ఒక్క వర్గానికి కూడా నయాపైసా ఉపయోగం లేదని విద్యుత్ నిపుణులు కొట్టిపారేస్తున్నారు. ఇంకా విచిత్రమేమిటంటే, ఈఆర్‌సీ నుండి ఎలాంటి అధికారిక అనుమతులు రాకముందే, అనధికారికంగా రైతు డిస్కమ్‌కు పాలక వర్గాన్ని ఏర్పాటు చేయడంతో పాటు ఆస్తులు, అప్పుల విభజన కసరత్తు కూడా పూర్తి చేసేశారు. న్యాయ వ్యవస్థతో సమానమైన ఈఆర్‌సీని అవమానించేలా యాజమాన్యం వ్యవహరిస్తోందని, కేవలం ప్రభుత్వ పెద్దల మెప్పు కోసమే బ్యూరోక్రాట్లు అల్లిన సాలీడు గూడు ఇదని మేధావులు మండిపడుతున్నారు.

**రోజుకో మాట మారుస్తున్న యాజమాన్యం!**

కొత్త డిస్కమ్‌కు అవసరమైన ఉద్యోగుల విభజనపై విద్యుత్ సంస్థల యాజమాన్యం రోజుకో కొత్త విధానాన్ని తెరపైకి తెస్తోంది. ఇక్కడ ఖాళీగా ఉన్న పోస్టుల కంటే రెట్టింపు సంఖ్యలో దరఖాస్తులు వచ్చాయని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ, దాని వెనుక అసలు రహస్యం వేరే ఉందనే విమర్శలు వినిపిస్తున్నాయి. రిటైర్మెంట్‌కు దగ్గరగా ఉన్న వారు, చాలా కాలంగా ప్రమోషన్లు లేని వారికి 'పదోన్నతుల ఎర' వేయడం.. అలాగే హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో పనిచేసే అవకాశం దక్కుతుందనే ఆశతోనే దరఖాస్తులు వచ్చాయని ఉద్యోగ సంఘాలు స్పష్టం చేస్తున్నాయి. ఇటు జెన్‌కోలో కొంత భాగాన్ని ప్రైవేట్‌పరం చేసి, అక్కడ మిగిలిపోయే ఇంజనీర్లను, సిబ్బందిని ఈ రైతు డిస్కమ్‌కు బదిలీ చేయాలనే మరో ఆలోచన కూడా యాజమాన్యం చేస్తోంది. ఉద్యోగులు తమ హక్కుల పరిరక్షణ కోసం ఎక్కడ కోర్టులను ఆశ్రయిస్తారోననే భయంతో విద్యుత్ సంస్థలు ముందస్తుగానే 'కేవియట్' దాఖలు చేయడం వారి అభద్రతాభావాన్ని తెలియజేస్తోంది.

**లక్షలాది కనెక్షన్లు.. కొద్దిమంది సిబ్బందితో సాధ్యమేనా?**

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సుమారు 30 లక్షలకు పైగా వ్యవసాయ, ప్రభుత్వ కనెక్షన్లు, లక్షలాదిగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ల నిర్వహణను కేవలం కొద్దిమంది సిబ్బందితో కొత్త డిస్కమ్ ఎలా నడపగలదనేది పెద్ద యక్షప్రశ్నగా మారింది. క్షేత్రస్థాయిలో లైన్ మెన్లు, సబ్‌స్టేషన్ సిబ్బంది కొరత తీవ్రంగా వేధించనుందని, దీనివల్ల భవిష్యత్తులో రైతులకు నాణ్యమైన ఉచిత విద్యుత్ అందడం అసాధ్యంగా మారుతుందని రైతు సంఘాల నాయకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొత్త డిస్కమ్ పేరిట సరికొత్త నిబంధనలు తీసుకువచ్చి భవిష్యత్తులో వ్యవసాయ ఉచిత విద్యుత్‌కు ఎసరు పెట్టేందుకే ఈ కుట్ర జరుగుతోందా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. జూన్ 2వ తేదీన ఎలాగైనా ఈ డిస్కమ్‌ను ప్రారంభించాలని ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసుకుంటున్న వేళ.. నేటి ఈఆర్‌సీ విచారణ తీర్పు ప్రజాభిప్రాయానికి అనుకూలంగా ఉంటుందా, లేక ప్రభుత్వం చెప్పినట్లే వింటుందా అనేది విద్యుత్ రంగ భవిష్యత్తును శాసించనుంది.

## దేశానికి ఆదర్శంగా ఫ్యూచర్ సిటీ

**హైదరాబాద్, మే 28, సిరి న్యూస్:**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అభివృద్ధి చేస్తున్న ఫ్యూచర్ సిటీ దేశానికే ఆదర్శంగా నిలిచే విధంగా రూపుదిద్దుకుంటోందని మంత్రులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి, శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. ఫ్యూచర్ సిటీలో నిర్మాణంలో ఉన్న ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ(ఎఫ్‌సీడీఏ) కార్యాలయ భవనం, స్కిల్ యూనివర్సిటీ నిర్మాణ పనులను వారు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఫ్యూచర్ సిటీని అత్యాధునిక సౌకర్యాలతో అభివృద్ధి చేస్తోందన్నారు. ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ కార్యాలయ ప్రారంభోత్సవాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా జూన్ 2 లేదా 3 తేదీల్లో నిర్వహించే అంశంపై త్వరలో నిర్ణయం తీసుకోనున్నట్లు తెలిపారు. ఆ కార్యక్రమానికి ముందుగా పనుల పురోగతిని పరిశీలించేందుకు తాము వచ్చామన్నారు. ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ కార్యాలయం ద్వారా నగర అభివృద్ధి పనులకు మరింత వేగం చేకూరుతుందని పేర్కొన్నారు. ఇక్కడ తీసుకునే ప్రతి నిర్ణయం, ప్రతి కార్యాచరణ గ్లోబల్ ప్రమాణాలకు అనుగుణంగా ఉండేలా స్పష్టమైన దృక్పథంతో పనిచేస్తున్నామని తెలిపారు. ఇప్పటికే పోలీస్ కమిషనరేట్ ఏర్పాటుతోపాటు గ్లోబల్ ప్రైజెన్స్ కలిగిన ప్రభుత్వ కార్యాలయాలను కూడా ఇక్కడినుంచే నిర్వహించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని వెల్లడించారు. స్కిల్ యూనివర్సిటీ శాశ్వత క్యాంపస్ పనులను తనిఖీ చేశారు. విద్య, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాల కల్పనకు కేంద్రంగా స్కిల్ యూనివర్సిటీ నిలవబోతోందని చెప్పారు. క్షేత్రస్థాయిలో పనుల పురోగతిని సమీక్షించి నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని, నిర్దేశిత గడువులోగా పనులు పూర్తి చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. మంత్రి పొంగులేటి మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడిన నాటినుంచి ఎదురైన ఆటుపోట్లు అధిగమిస్తూ సమస్యలను పరిష్కరిస్తూ సానుకూల దృక్పథంతో ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. ప్రపంచంలోని అనేక దేశాలు, రాష్ట్రాలు సైతం ఆలోచించని విధంగా రాష్ట్ర అభివృద్ధి కోసం వినూత్న కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. ప్రస్తుతం తాత్కాలిక క్యాంపస్‌లో కొనసాగుతున్న యూనివర్సిటీకి శాశ్వత క్యాంపస్ నిర్మాణం వేగంగా జరుగుతోందని, పనుల పురోగతిని సమీక్షించి అవసరమైన నిర్ణయాలు తీసుకుని నిర్మాణాన్ని మరింత వేగవంతం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ కమిషనర్ కె.శశాంక, మహేశ్వరం డీసీపీ కె.నారాయణ రెడ్డి, సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## కాజీపేటలో రైళ్ల తయారీ
# యూనిట్ పూర్తి దశలో

- **ఐదేళ్లలో 200 ఇంటర్ సిటీ రైళ్ల తయారీ లక్ష్యం**
- **రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్**

**న్యూఢిల్లీ, మే28 :**

తెలంగాణలోని కాజీపేట రైళ్ల తయారీ యూనిట్ పనులు పూర్తి దశకు చేరుకున్నాయని రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. త్వరలో అక్కడ ఇంటర్ సిటీ రైళ్ల తయారీ ప్రారంభమవుతుందని తెలిపారు. కాజీపేట రైల్వే తయారీ యూనిట్‌పై ఆయన కీలక సమీక్ష నిర్వహించారు.



రానున్న ఐదేళ్లలో ఈ యూనిట్‌లో 200 ఇంటర్ సిటీ రైళ్లను తయారు చేసే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని మంత్రి తెలిపారు. ఇక్కడ తయారయ్యే రైళ్లను దేశవ్యాప్తంగా స్వల్ప దూర ప్రయాణాల కోసం వినియోగించనున్నట్లు చెప్పారు.

కొత్త ఇంటర్ సిటీ రైళ్లు ఆధునిక సౌకర్యాలతో రూపొందుతున్నాయని తెలిపారు. ఆటోమేటిక్ డోర్ క్లోజింగ్ వ్యవస్థ, మెరుగైన వెంటిలేషన్ సదుపాయాలు ఇందులో ఉంటాయని చెప్పారు. ప్రతి రైలులో 20 కోచ్‌లు ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు.

ఈ రైళ్లు గంటకు 130 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించేలా తయారు చేస్తున్నామని మంత్రి తెలిపారు. రీజనరేటివ్ బ్రేకింగ్ సాంకేతికతను కూడా అందుబాటులోకి తీసుకొస్తున్నామని చెప్పారు. రైలు బ్రేకులు వేసిన సమయంలో ఉత్పత్తి అయ్యే విద్యుత్‌ను తిరిగి గ్రిడ్‌లోకి పంపే విధంగా ఈ సాంకేతికత పనిచేస్తుందని వివరించారు.

# రైతులారా అధైర్యపడకండి

- **ఇప్పటికే 58 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ.**
- **మద్దతు ధర ప్రకటించిన కేంద్రం చేతులు ఎత్తేసింది**
- **16,479 కోట్ల భారం రాష్ట్రంపై మోపింది**
- **ఎంతటి భారమైనా రైతులకు న్యాయం చేస్తాం**
- **ఇది రైతులు ఎన్నుకున్న ప్రభుత్వం**
- **ప్రజలను తప్పుదోవ పట్టించే యత్నాల మానుకోవాలి**
- **బీఆర్ఎస్ నేతలకు మంత్రి ఉత్తమ్ హితవు**

**హైదరాబాద్, మే 28 సిరి న్యూస్:**

అండగా ఉంటాం.. రాష్ట్ర రైతాంగం అధైర్య పడొద్దని నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి భరోసా ఇచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్రంలో రైతుపక్షపాత ప్రభుత్వం ఏర్పడిందని, అటువంటి ప్రభుత్వం రైతాంగానికి వెన్నుదన్నుగా నిలుస్తోందని ఆయన స్పష్టం చేశారు. రబీ సీజన్ లో చివరి గింజ వరకు ధాన్యం కొనుగోలుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఇందులో ఎటువంటి అపోహలకు ఆస్కారమే లేదని ఆయన తేల్చిచెప్పారు. రబీ సీజ నో తుది దశకు చెరుకున్న ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియపై సహచర మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తదితరులతో కలసి భోనగిరి యాదాద్రి,పెద్దపల్లి, వరంగల్ జిల్లాలో గురువారం పర్య టించారు. ఈ సందర్భంగా యాదాద్రి జిల్లాలోని వంగపల్లి గ్రామంలో దాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన మంత్రుల బృందం ఆ తదుపరి సమీపంలోని రామాజిపేటలోని భారత ఆహార సంస్థకు చెందిన గోదాములో నిల్వ చేసిన ధాన్యాన్ని పరిశీలించింది.

అనంతరం కలెక్టర్ కార్యాలయంలో ఆయన ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియపై ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య యాదవ్, ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యేలు కుంభం శ్రీనివాస రెడ్డి, వేముల వీరేశం, మందుల శ్యామ్యాల్, పౌర సరఫరాల శాఖా కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, జిల్లా కలెక్టర్.డి.సి.పి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ రబీ సీజన్ లో మద్దతు ధర ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం కొనుగోలు ప్ర క్రియలో 52 లక్షల మెట్రిక్ టన్నులకే పరిమి తము అయ్యి చేతులు ఎత్తేసిందని ఆరోపించారు. దానితో రాష్ట్ర ప్రభుత్వం అదనంగా కొనుగోలు చేసిన 23 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యానికి గాను 16,479 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం మీద కేంద్రం భారం మోపిందని ఆయన విమర్శిం చారు. ఎంతటి భారమైనా రైతుల గురుంచి మోసేందుకు రాష్ట్ర ప్రభుత్వం వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు. పారద ర్శకంగా దాన్యం కొనుగోళ్ల ప్రక్రియ కొనసాగు తుందని అయితే బీహార్, పశ్చిమ బెంగాల్ నుంచి వలస వచ్చిన కార్మికులు అక్కడ జరు గుతున్న ఎన్నికల్లో పాల్గొనేందుకు వెళ్లి తిరిగి రావడంలో ఒకింత ఇబ్బంది ఏర్పడిందని మిగితా వన్నీ సజావుగానే కొనసాగుతున్నాయన్నారు. స్వతంత్ర భారతదేశ చరిత్రలోనే మిగిలిన 28 రాష్ట్రలలో లేని విదంగా రికార్డ్ స్థాయిలో 8575 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన ఘనత రాష్ట్ర ప్రభుత్వానికి దక్కిందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన రోజునుండి పంట పంటకు రికార్డ్ స్థాయిలో ధాన్యం దిగుబడి రావడమే కాకుండా అంతే రికార్డ్ స్థాయిలో కొనుగోలు చేయ డం దేశ చరిత్రలోనే సరికొత్త రికార్డ్ సృ ష్టించిందని ఆయన పేర్కొన్నారు. ఈ రబీ సీజ న్ లో ఇప్పటికే 58 లక్షల మెట్రిక్ టన్నుల ధా న్యాన్ని కొనుగోలు చేసిన రాష్ట్ర ప్రభుత్వం మరో 17 లక్షలు కలిపి మొత్తం 75 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు ప్రభు త్వం సిద్ధంగా ఉందని ఆయన స్పష్టంగా ప్రకటించారు. కొనుగోలు చేసిన ధాన్యానికి రాష్ట్ర ప్రభుత్వం రైతుల ఖాతాల్లో నేరుగా 11,000 వేల కోట్లు జమ చేసిందని ఆయన తెలిపారు. కేంద్రం ప్రకటించిన మద్దతు ధరతో పాటు కేంద్రం పెట్టిన టార్గెట్ ను ఇప్పటి వరకు ఏ ఒక్కరూ చేరుకోలేదని మొట్ట మొదటిసారిగా రాష్ట్ర ప్రభుత్వం కేంద్రం టార్గెట్ ను అధిగమించి రికార్డ్ స్థాయిలో కొనుగోలు జరుపుతున్నామని, ఇది రైతాంగం గమనించాలని విజ్ఞప్తి చేశారు. కేంద్రం 52 లక్షల మెట్రిక్ టన్నులకే పరిమితమైతే అదే కేంద్రం ప్రకటించిన మద్దతు ధరతోటే రాష్ట్ర ప్రభుత్వం అదనంగా 23 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేసి 16,479 కోట్ల అదనపు భారాన్ని భరిస్తున్నదని ఆయన వివరించారు. అకాల వర్షాలతో తడిసిన ధాన్యాన్ని సైతం రాష్ట్ర ప్రభుత్వం మద్దతు ధరతో కొనుగోలు చేసి సత్వరమే బాయిల్డ్ రైస్ మిల్లులకు తరలించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. కొనుగోళ్ల ప్రక్రియ తుదిదశకు చేరుకుందని అకాల వర్షాలతోపాటు, రుతుపవనాలు వచ్చే లోపు మిగిలిన ధాన్యాన్ని యుద్ధప్రాతిపదికన కొనుగోళ్ల పై ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన అధికారులను ఆదేశించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని తరలించేందుకు వీలుగా ఇసుక రవాణా చేసే వాహనాలను, ఆయా ప్రాం తాలలో ఫ్యాక్టరీలు వినియోగించే వాహనాలను ధాన్యం తరలింపుకు మళ్లించాలని ఆయన సూచించారు.

**రైతులను తప్పుదారి పట్టించేలా బీజేపీ, బీఆర్ఎస్ కుట్రలు**

రాజకీయ ప్రయోజనాలనాశించే బి.ఆర్.ఎస్. బిజెపిలు రైతాంగాన్ని తప్పు దోవ పట్టించేందుకు ప్రయత్నిస్తున్నారని మంత్రి ఉత్తమ్ ఆరోపించారు. మద్దతు ధర ప్రకటించిన కేంద్రం ప్రభుత్వం కేంద్రం పెడుతున్న కొనుగోళ్ల టార్గెట్ ను పెంచేందుకు ఇక్కడి బిజెపి నేతలు కేం ద్రం మీద ఎందుకు వత్తిడి తేవడం లేదని సూటిగా ప్రశ్నించారు. ధాన్యం కొనుగోళ్ల అంశంపై బి.ఆర్.ఎస్ కు చిత్తశుద్ధి ఎంతమాత్రం లేదని వారి పదేళ్ల పాలనతో పోల్చి చూసినప్పుడు రికార్డ్ స్థాయిలో దిగుబడి, కొనుగోళ్ళు జరిగాయని తెలిపారు. ప్రజల్లో గందరగోళం సృష్టించి రాజకీయ ప్రయోజనం పొందలన్నది బి.ఆర్.ఎస్ నేతల ఉద్దేశ్యంగా కనిపిస్తోందన్నారు. రైతులకు నిజానిజాలు ఏమిటో అన్నది బాగా తెలుసని ఇది రైతులు ఎన్నుకున్న ప్రభుత్వమని తప్పు దోవ పట్టిస్తే తప్పు దోవ పట్టడానికి రైతులు సిద్ధంగా లేరన్నారు. ఇప్పటికైనా ఆ తరహా ప్రయత్నాలు మానుకోవాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి హితవు పలికారు.

# ప్రశాంతంగా బక్రీద్





- ఈద్గాల వద్ద పటిష్ట పోలీసు బందోబస్తు
- నవాబ్‌పేట్,గాంధీనగర్ ఈద్గాల వద్ద భద్రతా ఏర్పాట్లు.
- జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు.

**మెదక్ మే,28(సిరిన్యూస్)**

బక్రీద్ పండుగ ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని జిల్లా ఎస్పీ డి వి శ్రీనివాస రావు పేర్కొన్నారు.గురువారం మెదక్ పట్టణంలోని నవాబ్‌పేట్,గాంధీ నగర్ ఈద్గాల వద్ద ఏర్పాటు చేసిన పోలీసు బందోబస్తును పరిశీలించారు.పండుగ ప్రశాంత వాతావరణంలో జరగాలని పోలీసు అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు.నవాబ్‌పేట్ ఈద్గా వద్ద అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ పర్యవేక్షణలో ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు కొనసాగుతున్నాయని ఎస్పీ తెలిపారు. ఈద్గాల పరిసర ప్రాంతాల్లో పోలీసు పికెటింగ్, మొబైల్ పెట్రోలింగ్, ట్రాఫిక్ నియంత్రణ చర్యలను మరింత కట్టుదిట్టం చేసినట్లు చెప్పారు. పండుగ సందర్భంగా ప్రజలు పరస్పర సహకారంతో శాంతియుతంగా వేడుకలు జరుపుకోవాలని ఎస్పీ కోరారు. సోషల్ మీడియాలో వచ్చే పుకార్లు, అసత్య ప్రచారాలను నమ్మవద్దని సూచించారు. ఎలాంటి అనుమానాస్పద ఘటనలు గమనించిన వెంటనే సమీప పోలీసు సిబ్బందికి లేదా డయల్ 100కు సమాచారం అందించాలని తెలిపారు. జిల్లాలో శాంతి భద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా అన్ని రకాల ముందస్తు చర్యలు చేపట్టామని, ప్రజలు నిర్భయంగా పండుగ జరుపుకునేలా పోలీసు శాఖ అప్రమత్తంగా విధులు నిర్వహిస్తోందన్నారు.ఈ కార్యక్రమంలో మెదక్ డియస్పి ప్రసన్న కుమార్, సీఐ లు మహేష్, సందీప్ రెడ్డి, ఎస్సై లు సిబ్బంది తదితరులు ఉన్నారు.

## రోహిణి కార్తి వచ్చిన ధాన్యం అమ్ముడు పోక రోడ్డు పైనే రైతు విలవిల

- ధాన్యం కొనుగోలు చేయని ప్రభుత్వానికి రైతు ఉసురు తగులుతుంది.
- నర్సాపూర్ శాసనసభ్యురాలు సునీత లక్ష్మారెడ్డి

**వెల్దుర్తి, మే 28,(సిరి న్యూస్):**



రోహిణి కార్తి వచ్చిన ధాన్యం అమ్ముడు పోక కల్లాల్లోనే రైతులు విలవిలాడుతున్నాడని, ధాన్యం కొనుగోలు చేయని ప్రభుత్వానికి రైతు ఉసురు ముడుతుంది అని , నర్సాపూర్ శాసనసభ్యురాలు సునీత లక్ష్మారెడ్డి రెడ్డి గురువారం ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వెల్దుర్తి మండలంలోని రైతులతో కలిసి వెల్దుర్తి నర్సాపూర్ మెదక్ ప్రధాన రహదారిపై ధర్నా,రాస్తా రాకో, నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ రెండు నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు మార్కెట్ల లో 30 శాతం దాన్యం నిలువలు పేరుకుపోయి ఉన్నాయని ఆమె అన్నారు. రోని కార్తీ లో రైతులు దుక్కులు దున్ని, నారుమల్లు పోసే సమయం వచ్చినా గాని, ఇప్పటివరకు కూడా ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేయకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటి వరకు నారుమల్లలో ఉండాల్సిన రైతు, కల్లాలో గత పంటను పట్టుకొని ఎప్పుడు అమ్ముడు పోతుందా...అని పడి గాపులు కాస్తున్నాడని,వారు ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వాన్ని విమర్శించే కాంగ్రెస్ నాయకులు కల్లాల్లో రైతుల కష్టాలు కనిపిస్త లేవా పాలాభిషేకాలు కాదు రైతు కన్నీళ్లు తుడవండి అని ప్రశ్నించారు. రైతు ప్రభుత్వం అని గొప్పలు చెప్పుకున్న కాంగ్రెస్ నాయకులు రైతులకు చేసింది శూన్యమని అన్నారు. సకాలంలో రైతుబంధు వెయ్యకపోవడంతో పెట్టుబడి సాయం లేక రైతులు ఆర్ధికంగా నష్టపోయారన్నారు. వ్యక్తిగత విమర్శలు పక్కనపెట్టి రైతు కష్టాలు తీర్చాలని ప్రభుత్వాన్ని కోరారు. లేకుంటే రైతులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు భూపాల్ రెడ్డి, రమేష్ గౌడ్, కృష్ణ గౌడ్, ప్రతాప్ రెడ్డి, అశోక్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, అశోక్ గౌడ్, వెల్దుర్తి గ్రామ ఉపసర్పంచ్ శ్రవణ్ కుమార్,మహేష్ యాదవ్,శ్రీనివాస్ గౌడ్, మండలంలోని ఆయా గ్రామల సర్పంచులు నాయకులు రైతులు పాల్గొన్నారు.




# వేగంగా ధాన్యం అన్లోడింగ్ జరగాలి





**కొల్చారం మే 28,(సిరి న్యూస్)**

వేగంగా ధాన్యం అన్లోడింగ్ జరగాలని జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ గోడౌన్ నిర్వాహకులను ఆదేశించారు.గురువారం కొల్చారం మండల వరిగుంతం గ్రామంలోని గోడౌను ఆకస్మికంగా తనిఖీ చేశారు. వరి ధాన్యం కొనుగోలు , నిల్వ కోసం ఏర్పాటు చేసిన గిడ్డంగిని పరిశీలించారు.సేకరించిన వరి ధాన్యాన్ని ఈ గిడ్డంగిలో నిల్వ చేయనున్నట్లు తెలిపారు. గిడ్డంగిలోని నిల్వ సామర్థ్యం, అందుబాటులో ఉన్న సౌకర్యాలు ,భద్రతా ఏర్పాట్లను పరిశీలించి సంబంధిత అధికారులకు అవసరమైన సూచనలు అందించారు.ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ.. ధాన్యం అన్లోడింగ్ త్వరగా జరగాలని, లారీలను, లేబర్ ను అందుబాటులో ఉంచుకోవాలని,అన్లోడింగ్ ఆలస్యం జరగకుండా మరింత పకడ్బందీగా చర్యలు తీసుకోవాలన్నారు. అన్లోడింగ్ లో హమాలీని షిఫ్ట్ ల ప్రకారం పని చేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ తప్పడు ప్రచారాలను రైతులు నమ్మడం లేదు

- యుద్ధ ప్రాతిపదికన వడ్ల కొనుగోలు కొనసాగుతోంది
- రైతుల ఖాతాల్లో గంటల్లోనే డబ్బులు జమ చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

**కొండపాక, మే 28, (సిరి న్యూస్):**

కాంగ్రెస్ ప్రభుత్వంపై టిఆర్ఎస్ నేతలు చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని రైతులు నమ్మడం లేదని, వడ్ల కొనుగోలు యుద్ధ ప్రాతిపదికన కొనసాగుతుందని కాంగ్రెస్ నాయకులు స్పష్టం చేశారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్ నియోజకవర్గం కొండపాక మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో వెలికట్ట ఎక్స్ రోడ్ వద్ద మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వాసరి లింగారావు అధ్యక్షతన గురువారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు వాసరి లింగారావు, ఎఎంసీ వైస్ చైర్మన్ బట్ట పరశురాములు మాట్లాడుతూ బీఆర్ఎస్ నాయకుల తీరుపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. రైతుల పేరుతో రాజకీయాలు చేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వంపై తప్పుడు ప్రచారాలు చేయడం బీఆర్ఎస్ నాయకుల దివాళా రాజకీయాలకు నిదర్శనమని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల పక్షాన నిలబడి యుద్ధ ప్రాతిపదికన వడ్ల కొనుగోలు చేపట్టిందన్నారు. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా 54 లక్షల మెట్రిక్ టన్నులకు పైగా వడ్లను కొనుగోలు చేసి, రూ.7500 కోట్లకు పైగా రైతుల ఖాతాల్లో 12 గంటల్లోపే జమ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని తెలిపారు. రైతులు ప్రభుత్వ పనితీరుపై పూర్తి సంతృప్తితో ఉన్నారని పేర్కొన్నారు. గ్రామాల్లో చాలా వరకూ వడ్ల కొనుగోళ్లు పూర్తయ్యాయని, కొన్ని చోట్ల లారీల కొరత ఉన్నప్పటికీ స్థానిక ఎమ్మార్వోలు, సీఐలు, ఎసైలు స్వయంగా రంగంలోకి దిగి లారీలను సమీకరించి కొనుగోలు కేంద్రాలకు పంపిస్తూ సమస్యను అధిగమిస్తున్నారని తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం నిరంతరం చర్యలు తీసుకుంటోందన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో కూడా బీఆర్ఎస్ నాయకులు వడ్ల కొనుగోలు పేరుతో రోడ్లపైకి వచ్చి నిరసనలు చేయడం హాస్యాస్పదమని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, రైతు సంక్షేమ కార్యక్రమాలు చూసి జీర్ణించుకోలేక అక్కసుతో బీఆర్ఎస్ నేతలు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. ప్రజలు భవిష్యత్తులో తమను పూర్తిగా తిరస్కరిస్తారనే భయంతోనే బీఆర్ఎస్ నాయకులు ఆందోళనలకు దిగుతున్నారని ఎద్దేవా చేశారు. గత బీఆర్ఎస్ పాలనను గుర్తు చేస్తూ "వరి వేస్తే ఉరి" అంటూ రైతులను భయభ్రాంతులకు గురిచేసిన చరిత్ర బీఆర్ఎస్ దే నని అన్నారు. వరి వేయొద్దని, విత్తనాలు అమ్మొద్దని అధికారులతో సభలు పెట్టించి రైతులను అవమానించిన పార్టీ ఇప్పుడు రైతులపై ప్రేమ చూపించడం విడ్డూరమని వ్యాఖ్యానించారు. స్థానిక ఎమ్మెల్యేపై కూడా వారు తీవ్ర విమర్శలు చేశారు. లక్షల జీతాలు తీసుకుంటూ ఫామ్‌హౌస్‌కే పరిమితమై రైతుల కష్టాలను పట్టించుకోకపోవడం దురదృష్టకర మన్నారు. మాజీ ముఖ్యమంత్రి హోదాలో ఉన్న నాయకుడు నియోజకవర్గంలో తిరిగి రైతుల సమస్యలు తెలుసుకోవాలని, బీఆర్ఎస్ నాయకులు ముందుగా తమ నాయకత్వాన్ని ప్రశ్నించాలని డిమాండ్ చేశారు.

## సంపాదకీయం




## కన్నడ నాట 'కనకపుర' శకం..!

కర్ణాటక కాంగ్రెస్ రాజకీయాల్లో ఎట్టకేలకు ఒక పెద్ద అంకం ముగిసింది, మరో సరికొత్త అధ్యాయం మొదలైంది. గత మూడేళ్లుగా సాగుతున్న అంతర్గత అధికార ఉత్కంఠకు తెరదించుతూ, ముఖ్యమంత్రి పీఠాన్ని అధిరోహించేందుకు డీకే శివకుమార్‌కు కాంగ్రెస్ హైకమాండ్ లైన్ క్లియర్ చేసింది. సిద్ధరామయ్య తన పదవికి రాజీనామా చేయడంతో, రాష్ట్రంలో అధికార మార్పిడి ప్రక్రియ అధికారికంగా రూపుదాల్చింది. 2023 అసెంబ్లీ ఎన్నికల విజయం నాటి నుంచే వినిపిస్తున్న 'రెండున్నరేళ్ల అధికార మార్పిడి' సూత్రం కాస్త ఆలస్యంగానైనా అమల్లోకి రావడం, హస్తిన పెద్దల వ్యూహాత్మక చొరవకు నిదర్శనం. అయితే ఈ అధికార బదిలీ కేవలం ఒక వ్యక్తి స్థానంలో మరొకరు కూర్చోవడం లాంటి సాధారణ ప్రక్రియ కాదు. దీని వెనుక అనేక రాజకీయ లెక్కలు, సామాజిక సమీకరణాలు దాగి ఉన్నాయి. కాంగ్రెస్ పార్టీకి జాతీయ స్థాయిలో ఎప్పుడు ఏ కష్టం వచ్చినా ఆదుకునే 'ట్రబుల్ షూటర్'గా డీకే శివకుమార్‌కు పేరుంది. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా క్షేత్రస్థాయి నుంచి క్యాడర్‌ను నడిపించిన గట్టి పట్టు ఆయన సొంతం. అహరహం శ్రమించి పార్టీని అధికారంలోకి తెచ్చినా, నాటి రాజకీయ పరిస్థితుల దృష్ట్యా సిద్ధరామయ్యకు మొదటి విడతలో సీఎం పీఠాన్ని వదులుకోవాల్సి వచ్చింది. నాటి నుంచి నేటి వరకు ఉపముఖ్యమంత్రిగా ఓపిక పడుతూ, సరైన సమయం కోసం వేచి చూసిన డీకేఎస్, చివరకు అధిష్టానాన్ని ఒప్పించి తన పట్టు సాధించుకున్నారు. ఈ మార్పుతో కర్ణాటకలో అత్యంత ప్రాబల్యమున్న 'ఒకలిగ' సామాజిక వర్గానికి కాంగ్రెస్ పెద్ద పీట వేసినట్లయింది, ఇది రాబోయే 2028 అసెంబ్లీ ఎన్నికలపై ఖచ్చితంగా ప్రభావం చూపుతుంది. అయితే ఈ కిరీటం డీకే శివకుమార్‌కు అంత తేలికైనదేమీ కాదు. సిద్ధరామయ్య తన కేబినెట్ సహచరుల సమక్షంలో కన్నీటి పర్యంతమవుతూ డీకేఎస్ పేరును ప్రతిపాదించడం, ఇద్దరు నేతలు కౌగిలించుకుని ఐక్యతను ప్రదర్శించడం పైకి చూసేందుకు సజావుగానే సాగినట్లు అనిపించవచ్చు. కానీ సిద్ధరామయ్యకు ఉన్న 'అహింది' (మైనారిటీలు, వెనుకబడిన వర్గాలు, దళితులు) సామాజిక వర్గాల మద్దతును కాపాడుకుంటూ పాలన సాగించడం డీకేఎస్‌కు ఎదురయ్యే మొదటి సవాలు. మరోవైపు సిద్ధరామయ్య వర్గానికి చెందిన మంత్రులను, ఎమ్మెల్యేలను కలుపుకొని పోవడం, కేబినెట్ పునర్వ్యవస్థీకరణలో అసంతృప్తి తలెత్తకుండా చూసుకోవడం కత్తిమీద సామే అవుతుంది. పాలనాపరంగా కూడా సవాళ్లు తక్కువ ఏమీ లేవు. ఉచిత హామీల అమలు వల్ల రాష్ట్ర ఖజానాపై పడుతున్న ఆర్థిక భారం, బెంగళూరు నగర అభివృద్ధి, నీటి వనరుల సమస్యల వంటి కీలక అంశాలపై నూతన ముఖ్యమంత్రి తక్షణమే దృష్టి పెట్టాల్సి ఉంది. ప్రతిపక్ష బీజేపీ, జేడీఎస్ కూటమి అప్పుడే ఈ నాయకత్వ మార్పును ఆసరాగా చేసుకుని, కాంగ్రెస్‌లో అంతర్గత విభేదాల వల్లే పాలన కుంటుపడుతోందని విమర్శలు గుప్పిస్తోంది. ఇలాంటి తరుణంలో పరిపాలనలో తనదైన మార్క్ చూపిస్తూ, విపక్షాల విమర్శలకు పదునైన సమాధానం చెప్పాల్సిన బాధ్యత డీకే శివకుమార్‌పై ఉంది. ఒకవైపు సిద్ధరామయ్య క్రియాశీల రాజకీయాల్లోనే ఉంటూ మతతత్వ శక్తులపై పోరాటం కొనసాగిస్తానని స్పష్టం చేయడం ద్వారా తన పట్టును కోల్పోనని సంకేతాలిచ్చారు. ఈ నేపథ్యంలో ఇద్దరు అగ్రనేతల మధ్య సమన్వయం ఎలా సాగుతుందనే దానిపైనే కర్ణాటక ప్రభుత్వ భవిష్యత్తు ఆధారపడి ఉంటుంది. సంక్షోభాలను చక్కదిద్దడంలో ఆరితేరిన డీకే శివకుమార్, ఇప్పుడు స్వయంగా ముఖ్యమంత్రిగా మారి రాష్ట్ర సంక్షేమాన్ని, పార్టీ ప్రతిష్టను ఎలా కాపాడతారో కాలమే సమాధానం చెప్పాలి. సవాళ్ల నడుమ మొదలవుతున్న ఈ 'కనకపుర హార్డ్‌వేర్' మార్క్ పాలన సఫలీకృతం కావాలని ఆశిద్దాం.

## ప్రమాదవశాత్తూ వ్యక్తి మృతి

**పాపన్నపేట్ మే 28 (సిరి న్యూస్):**



చేపలు పట్టేందుకు వెళ్లి ప్రమాదవశాత్తూ నీట మునిగి వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని నాగ్సాన్ పల్లి శివారులోని చెలిమ కుంటలో గురువారం చోటు చేసుకుంది.ఎస్సై శ్రీనివాస్ గౌడ్ కథనం ప్రకారం వివరాలు...నాగ్సాన్ పల్లి గ్రామానికి చెందిన గుండు కిష్టయ్య(48) వ్యవసాయంతో పాటు చేపలు పడుతూ జీవితం గడుపుతున్నాడు. కాగా మంగళవారం సాయంత్రం చేపలు పట్టేందుకు వెళ్తున్నానని చెప్పి బయటకు వెళ్లి గ్రామ శివారులో చెలిమ కుంట చెరువులో చేపలు పడుతుండగా కాళ్లకు వల చుట్టుకోవడంతో ప్రమాదవశాత్తూ నీట మునిగి మృతి చెందాడు.తిరిగి ఇంటికి రాలేదు.దీంతో కుటుంబీకులు చుట్టూ పక్కల వెతికారు.గురువారం ఉదయం నాగ్సాన్ పల్లి గ్రామ శివారులోని చెలిమ కుంటలో అటుగా వెళ్లిన స్థానికులు నీటిలో మృతదేహాన్ని గమనించి పోలీసులకు, కుటుంబ సభ్యులు సమాచారం అందించడంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని వెలికి తీయించి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మెదక్ జిల్లా ఆసుపత్రికి తరలించారు.మృతుడి కుమారుడు రమేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

## కొల్చారం మండల వ్యాప్తంగా ఘనంగా బక్రీద్

**కొల్చారం మే 28 (సిరి న్యూస్)**

కొల్చారం మండల పరిధిలోని అన్ని గ్రామాలతో పాటు రంగంపేట ఎనగండ్ల తదితర గ్రామాలలో గురువారం నాడు బక్రీద్‌ను ఈద్ అల్ అద్హా అని కూడా పిలుస్తారు. ఇది ముస్లింలకు అత్యంత పవిత్రమైన పండుగలలో ఒకటి. అల్లాహ్ ఆజ్ఞకు విధేయత, త్యాగ భావన, ప్రేమ మరియు సేవా మనోభావాలకు ప్రతీకగా ఈ ఆయా గ్రామాలలోని ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు

## న్యాయవాదులపై అనుచిత వ్యాఖ్యలు..

### మహిళపై ఫిర్యాదు



**రామచంద్రపురం (పటాన్‌చెరు), మే 28 (సిరి న్యూస్):**

మెహదీపట్నంలో న్యాయవాది ఖాజా మొయినుద్దీన్ హత్య ఘటనపై అడిగిన ప్రశ్నకు బదులుగా న్యాయవాదులపై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ, న్యాయవాద వృత్తిని కించపరుస్తూ దిశ యూట్యూబ్ ఛానెల్‌లో మాట్లాడిన మహిళపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ పటాన్‌చెరు పోలీస్ స్టేషన్‌లో సీఐ వినాయక్ రెడ్డికి న్యాయవాదులు ఫిర్యాదు చేశారు.ఈ సందర్భంగా న్యాయవాదులు మాట్లాడుతూ.. సమాజంలో న్యాయవాద వృత్తికి ప్రత్యేక గౌరవం ఉందని, అలాంటి వృత్తిని అవమానించేలా వ్యాఖ్యలు చేయడం తగదన్నారు. న్యాయవాదులపై జరుగుతున్న దాడులను ప్రభుత్వం కఠినంగా అరికట్టాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతమైతే సహించబోమని, సంబంధితులు చట్టపరమైన తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు దయాకర్ రెడ్డి, అంగడి బాలరాజు, ముక్తల రామ్మోహన్, మహిళా న్యాయవాది రమాదేవి, నాగరాజు యాదవ్, రామారావు, శ్రవణ్, గారెల భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## బక్రీద్ వేడుకల్లో పాల్గొన్న మాజీ కార్పొరేటర్ పుష్పనగేష్



**రామచంద్రపురం, మే 28 (సిరి న్యూస్):**

త్యాగానికి ప్రతిరూపంగా నిలిచే బక్రీద్ పర్వదినం సందర్భంగా సమస్త మానవాళికి శాంతి చేకూరాలని ఆకాంక్షిస్తూ ముస్లిం సోదర, సోదరీమణులందరికీ రామచంద్రపురం మాజీ కార్పొరేటర్ బూరుగడ్డ పుష్పనగేష్ బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా రామచంద్రపురం డివిజన్ పరిధిలోని శ్రీనివాస్ నగర్ కాలనీ, బాంబే కాలనీలోని ఈద్గాలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రార్థనల్లో ఆయన పాల్గొన్నారు. అనంతరం ముస్లిం సోదర, సోదరీమణులతో కలిసి పర్వదిన శుభాకాంక్షలు పంచుకున్నారు.మత సామరస్యం, సోదరభావం సమాజానికి ఎంతో అవసరమని ఈ సందర్భంగా బూరుగడ్డ పుష్పనగేష్ పేర్కొన్నారు.

## మండలంలో కొనసాగుతున్న వివో ల నిరసన



**వెల్దుర్తి,మే 28,( సిరి న్యూస్):**

ఐకెపి సంఘాల్లో విధులు నిర్వహిస్తున్న వీ ఏవోల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ ఆ సంఘం ఆధ్వర్యంలో చేస్తున్న సమ్మె 11 రోజుకు చేరుకుంది. వెల్దుర్తి మండలంలోని ఐకెపి కార్యాలయం ముందు ఒంటికాళ్లతో నిరసన తెలుపుతున్నారు. మండల కేంద్రంలో నిర్వహించి సమ్మెకు స్థానిక నాయకులు సంఘీభావం తెలుపుతున్నారు.ప్రభుత్వం వెంటనే వివోఏ డిమాండ్లను పరిష్కరించాలని కోరారు.ఈ సందర్భంగా వివోఏలు మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించకపోతే రాబోయే రోజులలో సమ్మెను ఉధృతం చేస్తామని వారు తెలిపారు.

## బండలగూడలో ఘనంగా బక్రీద్ వేడుకలు



**రామచంద్రపురం, మే 28 (సిరి న్యూస్):**

ఇస్లాం మతంలో అత్యంత పవిత్రమైన త్యాగాల పండుగగా భావించే బక్రీద్ పర్వదిన వేడుకలను బండలగూడలో మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా బండలగూడలోని ఈద్గాలో మత పెద్దలతో కలిసి ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రార్థనల్లో యాదగిరి యాదవ్ పాల్గొన్నారు. అనంతరం ముస్లిం సోదరులకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు.అల్లా పట్ల ప్రవక్త ఇబ్రహీం చూపిన అపారమైన భక్తి, త్యాగనిరతికి ప్రతీకగా బక్రీద్ పండుగను ముస్లిం సోదరులు జరుపుకుంటారని యాదగిరి యాదవ్ పేర్కొన్నారు. మత సామరస్యం, సోదరభావం సమాజంలో మరింత పెరగాలని ఆకాంక్షించారు.

# తడిసిన వరి ధాన్యం కొనుగోలు చేయాలి

- **మిల్లుల వద్ద లారీలు ఆగకుండా చర్యలు తీసుకోవాలి**
- **తూప్రాన్ ఆర్డీవో జయ చంద్రారెడ్డి**

**వెల్దుర్తి, మే 28,( సిరి న్యూస్):**



రైతులు పండించిన ప్రతి గింజకు సరైన ధర దక్కేలా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని తూప్రాన్ ఆర్డీవో జయచంద్ర రెడ్డి అన్నారు. రైతులు ధాన్యం అమ్మకానికి వచ్చినప్పుడు ఎటువంటి ఇబ్బందులు లేకుండా కొనుగోలు ప్రక్రియ వేగవంతంగా, పారదర్శకంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. తేమ కారణంగా తడిసిన వరి, ధాన్యాన్ని కూడా రైతులకు నష్టం కలగకుండా ప్రభుత్వ నిబంధనల మేరకు కొనుగోలు చేస్తామని అయన స్పష్టం చేశారు. గురువారం వెల్దుర్తి మండల కేంద్రం పరిధిలోని రైస్ మిల్లులను అలాగే పిఎసిఎస్ గోదాములను ఆకస్మికంగా సందర్శించారు. మిల్లులలో నిల్వ ఉంచిన వరి, ధాన్యాం బస్తాల నిలువలను పరిశీలించి.. మిల్లింగ్ వ్యవస్థపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మిల్లులలో రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎలా నిల్వ చేస్తున్నారో, గిడ్డంగుల సామర్థ్యం ఎంత ఉందో, నాణ్యత పరిరక్షణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారో అడిగి తెలుసుకున్నారు. ధాన్యం నిల్వలో నిర్లక్ష్యం వహిస్తే నాణ్యత దెబ్బతినే అవకాశం ఉందని, వర్షాల నేపథ్యంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

### అవసరమైన సిబ్బంది ఉండాలి

వరి, ధాన్యం తడవకుండా టార్పాలిన్లు, కవర్లు ఏర్పాటు చేయాలని, నిల్వ గిడ్డంగులు పరిశుభ్రంగా ఉంచాలని అధికారులకు ఆదేశించారు. హమాలీల సంఖ్య, అందుబాటులో ఉన్న హమాలీలు ఎంత మంది? అనే వివరాలు తెలుసుకొని, అవసరమైతే అదనపు హమాలీలను ఏర్పాటు చేయాలని సూచించారు. రైతులు గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి రాకుండా తూకం ప్రక్రియ, రవాణా ఏర్పాట్లు వేగవంతం చేయాలని తెలిపారు. ధాన్యం కొనుగోలు అనంతరం వెంటనే మిల్లింగ్ ప్రక్రియకు తరలించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.ధాన్యం కొనుగోలు సమయంలో తేమ శాతం, నాణ్యత ప్రమాణాలను సక్రమంగా పరిశీలించి పారదర్శకంగా నమోదు చేయాలని సూచించారు. రైతులకు ఎటువంటి అన్యాయం జరగకుండా ప్రతి దశలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. కొనుగోలు కేంద్రాల్లో సమస్యలు తలెత్తకుండా నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు. సివిల్డి ఈ కార్యక్రమంలో ఆర్డిఓ వెంట ఆర్ఐ నర్సింగ్ యాదవ్ రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# సదాశివపేట పట్టణ కాంగ్రెస్ ఇంచార్జిగా తోపాజి అనంత కిషన్

- **టీపీసీసీ ప్రధాన కార్యదర్శి జగ్గారెడ్డి కీలక ఆదేశాలు**
- **సమన్వయకర్తలతో కలిసి పనిచేయాలని సూచన**

**సదాశివపేట, మే 28, సిరి న్యూస్:**

సదాశివపేట పట్టణ కాంగ్రెస్ పార్టీ పూర్తి స్థాయి ఇంచార్జిగా మరియు మున్సిపల్ వ్యవహారాల ఇంచార్జిగా టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి ముఖ్య నిర్ణయం తీసుకున్నారు. ఈ బాధ్యతలను సీనియర్ నాయకులు తోపాజి అనంత కిషన్‌కు అప్పగిస్తూ ఆయన అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. సదాశివపేట పట్టణంలో పార్టీని మరింత బలోపేతం చేయడంతో పాటు,



రాబోయే పట్టణ కమిటీ నియామక ప్రక్రియకు సంబంధించిన పూర్తి వ్యవహారాలను అనంత కిషన్ పర్యవేక్షించాల్సి ఉంటుందని జగ్గారెడ్డి స్పష్టం చేశారు. ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ.. పట్టణ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అందరినీ కలుపుకొని సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు. పార్టీ బలోపేతం కోసం నియమితులైన సమన్వయకర్తలు కంబలపల్లి రాంరెడ్డి, సీడీసీ చైర్మన్ సిద్దన్న, బ్లాక్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ మరియు నియోజకవర్గ కన్వీనర్ ఆంజనేయులులతో కలిసి తోపాజి అనంత కిషన్ సంయుక్తంగా పనిచేయాలని ఆదేశించారు. స్థానిక మున్సిపల్ వ్యవహారాల్లో మరియు ప్రజా సమస్యల పరిష్కారంలో కాంగ్రెస్ శ్రేణులు నిరంతరం ముందుండాలని పిలుపునిచ్చారు. ఈ నియామకం పట్ల సదాశివపేట పట్టణ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తూ తోపాజి అనంత కిషన్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

# నల్లవల్లిలో తడిసిన వరి ధాన్యం కొనుగోలు చేయాలి

- **రైతులను ఆదుకోవాలని ప్రభుత్వానికి ప్రజల డిమాండ్**

**గుమ్మడిదల, మే 28 (సిరి న్యూస్):**

అకాల వర్షాల కారణంగా నల్లవల్లి గ్రామంలోని ఐకెపి కేంద్రాల్లో నిల్వ ఉంచిన వరి ధాన్యం పూర్తిగా తడిసి పోవడంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఎన్నో కష్టాలు పడి పండించిన పంటను ఐకెపి కేంద్రాలకు తీసుకొచ్చిన రైతులు ఇప్పుడు తమ ధాన్యం పరిస్థితి చూసి కన్నీళ్లు పెట్టుకునే పరిస్థితి ఏర్పడింది. రైతులు అప్పులు చేసి విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు కొనుగోలు చేసి ఎంతో శ్రమతో పంటను సాగు చేశారు. కోత పూర్తయ్యాక ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలపై ఆశలు పెట్టుకొని ధాన్యాన్ని ఐకెపి కేంద్రాలకు తరలించారు. అయితే సరైన రక్షణ చర్యలు లేకపోవడం, వర్షాలకు తగిన ఏర్పాట్లు చేయకపోవడం వల్ల వడ్లు పూర్తిగా తడిసిపోయాయి. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయకుండా అధికారులు నిర్లక్ష్యం చేస్తే రైతులు మరింత అప్పుల బారిన పడే ప్రమాదం ఉందని గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతు ఇప్పటికే ప్రకృతి వైపరీత్యాలతో నష్టపోయాడని, ఇప్పుడు ప్రభుత్వం కూడా సహకరించకపోతే రైతు కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి వస్తుందని అన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి నల్లవల్లి గ్రామంలోని తడిసిన వరి ధాన్యాన్ని ప్రత్యేకంగా కొనుగోలు చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. రైతులకు కనీస మద్దతు ధర కల్పించి వారిని ఆదుకోవాలని కోరుతున్నారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియలో ఆలస్యం చేస్తే రైతుల తరపున పెద్ద ఎత్తున



ఉద్యమాలు చేపడతామని హెచ్చరిస్తున్నారు. రైతు బతికితేనే దేశం బతుకుతుందనే విషయాన్ని ప్రభుత్వం గుర్తించి వెంటనే రైతులను ఆదుకుని చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు, రైతు సంఘాల నాయకులు కోరుతున్నాను.

# గ్రామాలను టీబీ రహితంగా తీర్చిదిద్దడమే లక్ష్యం

- **టీబీ నిర్మూలనకు గ్రామాల్లో ప్రత్యేక ఎక్స్‌రే శిబిరాలు**
- **గుమ్మడిదల పీహెచ్‌సీ పరిధిలో గ్రామాల వారీగా నిర్వహణ**

**గుమ్మడిదల, మే 28 ( సిరి న్యూస్):**

టీబీ ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా గుమ్మడిదల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని పలు గ్రామాల్లో ప్రత్యేక ఎక్స్‌రే పరీక్షల శిబిరాలు నిర్వహించనున్నట్లు వైద్యాధికారి డాక్టర్ ఎస్. మధుకర్ తెలిపారు. గ్రామాల్లో టీబీ అనుమానిత లక్షణాలు ఉన్న వ్యక్తులను గుర్తించి వారికి తక్షణ చికిత్స అందించి గ్రామాలను టీబీ రహితంగా తీర్చిదిద్దడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా మే 29న మంబాపూర్, జూన్ 1 నుంచి 3 వరకు గుమ్మడిదల, జూన్ 4న బొంతపల్లి, జూన్ 5 మరియు 6 తేదీలలో దోమడుగులో ప్రత్యేక ఎక్స్‌రే పరీక్షలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ముఖ్యంగా మద్యం సేవించే వారు, ధూమపానం చేసే వారు, పొగ, కాలుష్య ప్రభావం అధికంగా ఉండే ప్రాంతాల్లో నివసించే వారు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారు, 60 సంవత్సరాలు పైబడిన వ్యక్తులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఇటువంటి వర్గాల వారికి టీబీ వ్యాధి వచ్చే అవకాశాలు అధికంగా ఉంటాయని చెప్పారు.ప్రస్తుతం సమాజంలో చాలామంది తెలియకుండానే టీబీ బారిన పడుతున్నారని, ఈ వ్యాధి సామాజిక సమస్యగా మారిందని డాక్టర్ మధుకర్ తెలిపారు. రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం, శరీర బరువు తగ్గడం వంటి లక్షణాలు ఉన్న వారు తప్పనిసరిగా పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. టీబీ నిర్మూలన ప్రతి ఒక్కరి బాధ్యతగా తీసుకొని ప్రజా ప్రతినిధులు, స్వచ్ఛంద సేవా సంస్థలు, పొదుపు సంఘాల ప్రతినిధులు, గ్రామ ప్రజలంతా ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు.

# గుండె పోటుతో బానోతు క్రాంతి మృతి



**నర్సాపూర్ మే 28 (సిరి న్యూస్)**

నర్సాపూర్ మున్సిపాలిటీ 10వ వార్డు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసిన బానోతు క్రాంతి (30) గుండె పోటుతో మృతి చెందారు ఈ విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ ఆవుల రాజిరెడ్డి మృతి దేహానికి నివాళి అర్పించారు మృతితో పట్టణంలో కాంగ్రెస్ పార్టీ లో దిగ్భ్రాంతికి గురిచేసిందనీ యువ నాయకుడిగా ప్రజలకు చేరువై సేవాభావంతో పనిచేసిన మున్సిపల్ ఎన్నికలలో పోటీ చేసి అందరి దృష్టిలో ఉండిపోయారు ఆయన అకాల మరణం పార్టీకి, కుటుంబ సభ్యులకు, అభిమానులకు తీరని లోటు. అని అన్నారు రాజు యాదవ్ శ్రీధర్ గుప్తా , క్రాంతి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని అన్నారు

# వెల్‌డన్ వైభవ్.. యువ సంచలనాన్ని అభినందించిన కావ్య మారన్..

- ఐపీఎల్ ఎలిమినేటర్‌లో 15 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ విధ్వంసం
- 29 బంతుల్లో 97 పరుగులతో అద్భుత ఇన్నింగ్స్
- మ్యాచ్ అనంతరం వైభవ్‌ను ప్రత్యేకంగా అభినందించిన కావ్య మారన్
- ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్
- వైభవ్ అరుదైన టాలెంట్ అంటూ కితాబిచ్చిన ఎస్ఆర్‌హెచ్ కోచ్

**మనసులోమాట:**

ఐపీఎల్ 2026 ఎలిమినేటర్‌లో రాజస్థాన్ రాయల్స్ (ఆర్ఆర్) యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ అద్భుత ప్రదర్శనతో అదరగొట్టాడు. నిన్న సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఎస్ఆర్‌హెచ్)తో జరిగిన మ్యాచ్‌లో కేవలం 29 బంతుల్లో 97 పరుగులు చేసి విధ్వంసం సృష్టించాడు. ఈ 15 ఏళ్ల కుర్రాడి అసాధారణ ఆటతీరు ప్రత్యర్థి జట్టు యాజమాన్యాన్ని సైతం ఆకట్టుకుంది. ముఖ్యంగా ఎస్ఆర్‌హెచ్ సహ యజమాని కావ్య మారన్ చూపిన క్రీడా స్ఫూర్తి అందరినీ ఆకట్టుకుంది.

మ్యాచ్ అనంతరం కావ్య మారన్ స్వయంగా వైభవ్ వద్దకు వెళ్లి అతడిని ప్రత్యేకంగా అభినందించారు. యువ ఆటగాడితో కరచాలనం చేసి, ప్రశంసలు కురిపించారు. ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ప్రత్యర్థి జట్టు ఆటగాడిని ప్రోత్సహించిన కావ్య తీరుపై నెటిజన్లు ప్రశంసలు కురిపిస్తున్నారు.

**ఇలాంటి టాలెంట్‌ను చూడలేదు: జేమ్స్ ఫ్రాంక్లిన్**

మరోవైపు ఎస్ఆర్‌హెచ్ అసిస్టెంట్ కోచ్ జేమ్స్ ఫ్రాంక్లిన్ సైతం వైభవ్‌పై ప్రశంసల వర్షం కురిపించాడు. మ్యాచ్ అనంతరం ఫ్రాంక్లిన్ మాట్లాడుతూ.. "బహుశా ఇలాంటి టాలెంట్‌ను ఎవరూ చూసి ఉండరు. అతను చేస్తున్నది నమ్మశక్యంగా లేదు. అతనికి ఇంకా 25 ఏళ్ల కెరీర్ మిగిలి ఉందని ఊహించుకుంటేనే భయంగా ఉంది. భవిష్యత్తులో అతను మరింత మెరుగవుతాడు. మరింత బలంగా తయారవుతాడు" అని చెప్పుకొచ్చాడు.



# 15 ఏళ్లకే కోట్లకు పడగెత్తిన వైభవ్... ఆస్తి ఎంతో తెలుసా?

- 15 ఏళ్లకే క్రికెట్‌లో సంచలనంగా మారిన వైభవ్ సూర్యవంశీ
- రూ.10 కోట్లకు పైగా చేరిన నికర ఆస్తి
- ముంబైలో ఖరీదైన ఫ్లాట్, లగ్జరీ కార్లు, కోట్ల రూపాయల కాంట్రాక్టులు
- స్పాన్సర్‌షిప్‌ల ద్వారా భారీగా పెరుగుతున్న సంపాదన

**మనసులోమాట:**

ప్రస్తుతం భారత క్రికెట్ ప్రపంచంలో 15 ఏళ్ల యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ పేరు మారుమోగిపోతోంది. ఐపీఎల్ 2026 ఎలిమినేటర్ మ్యాచ్‌లో రాజస్థాన్ రాయల్స్ (ఆర్ఆర్) తరపున సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఎస్ఆర్‌హెచ్) పై కేవలం 29 బంతుల్లో 97 పరుగులు చేసి అందరి దృష్టినీ ఆకర్షించాడు. ఈ అద్భుత ప్రదర్శన తర్వాత అతని సంపాదన, నికర ఆస్తిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. చిన్న వయసులోనే ఈ యువ కెరటం రూ.10 కోట్లకు పైగా ఆస్తిని కూడబెట్టడం విశేషం.

**ఐపీఎల్ ద్వారా కోట్ల ఆదాయం**

2025 మెగా వేలంలో రాజస్థాన్ రాయల్స్ జట్టు వైభవ్‌ను రూ.1.1 కోట్లకు కొనుగోలు చేసింది. రెండో ఏడాది కూడా అదే మొత్తాన్ని జీతంగా అందుకుంటున్నాడు. దీంతో రెండేళ్లలో అతని ఐపీఎల్ జీతం రూ.2.2 కోట్లకు చేరింది. దీనికి అదనంగా ఆడిన ప్రతి మ్యాచ్‌కు రూ.7.5 లక్షల మ్యాచ్ ఫీజు లభిస్తుంది. ఇప్పటివరకు 22 మ్యాచ్‌లు ఆడిన వైభవ్‌కు కేవలం మ్యాచ్ ఫీజుల రూపంలోనే సుమారు రూ.1.65 కోట్లు అందాయి. అతని అద్భుత ఆటతీరు చూస్తుంటే, వేలంలో చెల్లించిన మొత్తం చాలా తక్కువ అనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

**ఆస్తులు.. ఖరీదైన బహుమతులు**

క్రికెట్ ఆదాయంతో పాటు వైభవ్‌కు విలువైన ఆస్తులు కూడా ఉన్నాయి. ముంబైలో సుమారు రూ.2.5 కోట్ల నుంచి రూ.3 కోట్ల విలువ చేసే విలాసవంతమైన అపార్ట్‌మెంట్‌ను అతను కొనుగోలు చేశాడు. బీహార్‌లోని సమస్తిపూర్ జిల్లా తాజ్‌పూర్‌లో ఉన్న అతని పూర్వీకుల ఇంటి విలువ కూడా రూ.40 లక్షల నుంచి రూ.60 లక్షల వరకు ఉంటుందని అంచనా.

2025 ఐపీఎల్‌లో అత్యధిక స్ట్రైక్ రేట్ సాధించినందుకు బహుమతిగా రూ.17 లక్షల విలువైన టాటా కర్వ్ ఈవీ కారును గెలుచుకున్నాడు. రాజస్థాన్ రాయల్స్ సహ యజమాని రంజిత్ బర్తకూర్ అతనికి మెర్సిడెస్ బెంజ్ కారును బహుమతిగా ఇచ్చినట్లు సమాచారం. 2026 అండర్19 ప్రపంచ కప్ ఫైనల్‌లో అద్భుత ప్రదర్శన కనబరిచినందుకు అప్పటి బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ నుంచి రూ.50 లక్షల నగదు బహుమతి కూడా అందుకున్నాడు.




**స్పాన్సర్‌షిప్‌లతో రెట్టింపు ఆదాయం**

ఐపీఎల్ జీతం, మ్యాచ్ ఫీజులు, ఆస్తులు, బహుమతుల విలువ కలిపి సుమారు రూ.7 కోట్లుగా ఉన్నప్పటికీ, వైభవ్‌కు పెరుగుతున్న స్పాన్సర్‌షిప్ ఒప్పందాలు అతని నికర ఆస్తిని గణనీయంగా పెంచుతున్నాయి. వివిధ బ్రాండ్లకు అంబాసిడర్‌గా వ్యవహరించడం ద్వారా వస్తున్న ఆదాయంతో అతని మొత్తం నికర ఆస్తి విలువ రూ.10 కోట్లు దాటి ఉంటుందని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. కేవలం 15 ఏళ్ల వయసులోనే ఈ స్థాయిలో సంపాదించడం అతని ప్రతిభకు, భవిష్యత్తుకు నిదర్శనంగా నిలుస్తోంది.

# అసలు రాజస్థాన్ జట్టులోకి వైభవ్ సూర్యవంశీ ఎలా వచ్చాడో తెలుసా?.. ఆ ఇంట్రెస్టింగ్ స్టోరీ ఇదే!

- దేశవాళీ క్రికెట్‌లో వైభవ్ ప్రతిభను గుర్తించిన ఆర్ఆర్ స్కౌట్ సమర్ ఖాద్రీ
- ఆర్ఆర్ స్కౌటింగ్ హెడ్ జుబిన్ భరుచా ఏర్పాటు చేసిన ట్రయల్స్‌కు హాజరైన వైభవ్
- ట్రయల్స్‌లో ఎదుర్కొన్న తొలి బంతినే సిక్సర్‌గా మలిచి అందరినీ ఆశ్చర్యపరిచిన వైనం
- వైభవ్‌ను 'జనరేషనల్ టాలెంట్' అని అభివర్ణించిన జుబిన్
- అతని కోసం రూ.10 కోట్లు సిద్ధం చేయాలని ఆర్ఆర్ యాజమాన్యానికి మెసేజ్

**మనసులోమాట:**

ఐపీఎల్‌లో కొత్త ప్రతిభను గుర్తించి, ప్రోత్సహించడంలో రాజస్థాన్ రాయల్స్ (ఆర్ఆర్) జట్టు ఎప్పుడూ ముందుంటుంది. సంజూ శాంసన్, యశస్వి జైస్వాల్ వంటి ఎందరో యువ సంచలనాలను వెలుగులోకి తెచ్చిన ఆర్ఆర్... తాజాగా మరో యువ ఆటగాడు వైభవ్ సూర్యవంశీని ఎలా గుర్తించిందనే ఆసక్తికర కథనం వెలుగులోకి వచ్చింది.

రాజస్థాన్ రాయల్స్ స్కౌటింగ్ బృందంలో సభ్యుడైన సమర్ ఖాద్రీ, దేశవాళీ క్రికెట్‌లో వైభవ్ సూర్యవంశీ ఆటను తొలిసారి గమనించాడు. ఓ లోకల్ మ్యాచ్‌లో వైభవ్ అమాంతం వరుస సిక్సర్లు బాదాడం చూశాడు. అతని అసాధారణ ప్రతిభకు ముగ్ధుడయ్యాడు. ఈ విషయాన్ని వెంటనే ఆర్ఆర్ స్కౌటింగ్ హెడ్ జుబిన్ భరుచా దృష్టికి తీసుకెళ్లాడు. దీంతో జుబిన్, వైభవ్ కోసం ప్రత్యేకంగా ఒక ట్రయల్ ఏర్పాటు చేశాడు.

ఈ ట్రయల్స్‌లో ఊహించని సంఘటన చోటు చేసుకుంది. వైభవ్ ఎదుర్కొన్న మొట్టమొదటి బంతినే సిక్సర్‌గా మలిచి అందరినీ ఆశ్చర్యపరిచాడు. గతంలో సంజూ శాంసన్, యశస్వి జైస్వాల్ కూడా ఆర్ఆర్ ట్రయల్స్‌లో తమ తొలి బంతికే సిక్సర్లు బాదడం విశేషం. ఈ అద్భుతమైన ప్రదర్శన చూసి జుబిన్ భరుచా అవాక్కయ్యాడు. వెంటనే అతను ఆర్ఆర్ యాజమాన్యానికి ఒక సందేశం పంపాడు.



"వేలానికి రూ. 10 కోట్లు సిద్ధం చేయండి. మన ముందుకు ఒక 'జనరేషనల్ టాలెంట్' వస్తున్నాడు" అని అందులో పేర్కొన్నాడు. ఈ ఒక్క సంఘటనతో వైభవ్ ప్రతిభపై ఆర్ఆర్ యాజమాన్యానికి ఎంతటి నమ్మకం ఏర్పడిందో స్పష్టమవుతోంది.

# 'కొత్త సిక్సర్ల మెషిన్' వైభవ్.. కచ్చితంగా ఆ మార్కును అందుకుంటావు

- ఐపీఎల్‌లో కొత్త సిక్సర్ల రికార్డు సృష్టించిన వైభవ్ సూర్యవంశీ
- ఒకే సీజన్‌లో 65 సిక్సర్లతో క్రిస్ గేల్ రికార్డు బ్రేక్
- వైభవ్ ఐపీఎల్‌కు దొరికిన కొత్త సిక్సర్ల మెషిన్ అంటూ యూనివర్సల్ బాస్ ప్రశంస
- ఎలిమినేటర్‌లో 29 బంతుల్లో 97 పరుగుల విధ్వంసక ఇన్నింగ్స్

**మనసులోమాట:**

ఐపీఎల్‌లో యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ కొత్త చరిత్ర సృష్టించాడు. రాజస్థాన్ రాయల్స్ (ఆర్ఆర్) తరపున ఆడుతున్న 15 ఏళ్ల యువ బ్యాటర్.. టీ20 క్రికెట్ దిగ్గజం క్రిస్ గేల్ పేరిట ఉన్న పలు రికార్డులను బద్దలు కొట్టి అందరి దృష్టిని ఆకర్షించాడు. సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఎస్ఆర్‌హెచ్)తో జరిగిన కీలక ఎలిమినేటర్ మ్యాచ్‌లో వైభవ్ కేవలం 29 బంతుల్లో 5 ఫోర్లు, 12 సిక్సర్లతో 97 పరుగులు చేసి విధ్వంసం సృష్టించాడు. 334కు పైగా స్ట్రైక్ రేట్‌తో సాగిన ఈ ఇన్నింగ్స్‌తో అతను ఒకే ఐపీఎల్ సీజన్‌లో అత్యధిక సిక్సర్లు బాదిన ఆటగాడిగా నిలిచాడు. ఈ సీజన్‌లో మొత్తం 65 సిక్సర్లు కొట్టిన వైభవ్, 2012లో క్రిస్ గేల్ నెలకొల్పిన 59 సిక్సర్ల రికార్డును అధిగమించాడు. ఇది ఏ టీ20 టోర్నమెంట్‌లోనైనా ఒకే సీజన్‌లో అత్యధిక సిక్సర్ల రికార్డు కావడం విశేషం.

వైభవ్ ప్రదర్శనపై క్రిస్ గేల్ స్వయంగా స్పందించి ప్రశంసలు కురిపించాడు. ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టులో.. "అద్భుతం వైభవ్ సూర్యవంశీ, ఐపీఎల్‌కు దొరికిన కొత్త సిక్సర్ల మెషిన్" అని అభినందించాడు. కేవలం 3 పరుగుల తేడాతో శతకం చేజార్చుకోవడంపై స్పందిస్తూ.. "నువ్వు దురదృష్టవంతుడివి. కానీ, కచ్చితంగా ఆ మార్కును అందుకుంటావు" అని ప్రోత్సహించాడు.

**ఐపీఎల్‌లో కొత్త సిక్సర్ల కింగ్.. వైభవ్ సూర్యవంశీ!**


ఈ సీజన్‌లో వైభవ్ సూర్యవంశీ అద్భుతమైన ఫామ్‌లో ఉన్నాడు. మొత్తం 15 ఇన్నింగ్స్‌లలో 45.33 సగటు, 242.85 స్ట్రైక్ రేట్‌తో 680 పరుగులు సాధించాడు. ఇందులో ఒక శతకం, నాలుగు అర్ధశతకాలు ఉన్నాయి. తన పరుగుల్లో 88.9 శాతాన్ని కేవలం ఫోర్లు, సిక్సర్లతోనే సాధించి, 2019లో ఆండ్రీ రస్సెల్ (85.5%) నెలకొల్పిన రికార్డును కూడా వైభవ్ బద్దలు కొట్టాడు. అంతేగాక ఒకే ఐపీఎల్ ఇన్నింగ్స్‌లో 10కి పైగా సిక్సర్లు బాదిన సందర్భాల్లో గేల్ (4 సార్లు) రికార్డును సమం చేయడమే కాకుండా, ఒకే సీజన్‌లో మూడుసార్లు ఈ ఘనత సాధించిన తొలి బ్యాటర్‌గా నిలిచాడు. కేవలం 15 ఏళ్ల వయసులోనే అసాధారణ ప్రతిభతో, వైభవ్ సూర్యవంశీ భారత క్రికెట్ భవిష్యత్తుకు ఓ కొత్త ఆశాకిరణంగా కనిపిస్తున్నాడు.



# ఐపీఎల్ ఎలిమినేటర్‌లో సన్‌రైజర్స్ ఘోర పరాజయం.. మైదానంలో కన్నీరు పెట్టుకున్న కావ్య మారన్!

- ఐపీఎల్ 2026 నుంచి సన్‌రైజర్స్ హైదరాబాద్ ఔట్
- ఎలిమినేటర్‌లో రాజస్థాన్ చేతిలో ఘోర పరాజయం
- సూర్యవంశీ విధ్వంసకర బ్యాటింగ్, ఆర్చర్ బౌలింగ్‌కు ఎస్ఆర్‌హెచ్ కుదేలు
- కావ్య గత ప్రవర్తనను గుర్తు చేస్తూ సోషల్ మీడియాలో ట్రోలింగ్

**మనసులోమాట:**



ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ (SRH) ప్రయాణం ముగిసింది. బుధవారం ముల్లాన్‌పూర్ వేదికగా రాజస్థాన్ రాయల్స్‌తో జరిగిన కీలక ఎలిమినేటర్ మ్యాచ్‌లో హైదరాబాద్ జట్టు ఘోర పరాజయం పాలైంది. భారీ అంచనాలతో బరిలోకి దిగిన ఆరెంజ్ ఆర్మీ.. బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో పూర్తిగా తేలిపోయి టోర్నీ నుంచి నిష్క్రమించింది. జట్టు ఓటమిని తట్టుకోలేక ఎస్ఆర్‌హెచ్ యజమాని కావ్య మారన్ మైదానంలోనే కన్నీటిపర్యంతమయ్యారు.

ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన రాజస్థాన్ రాయల్స్ నిర్ణీత 20 ఓవర్లలో 243 పరుగుల భారీ స్కోరు సాధించింది. రాజస్థాన్ యువ సంచలనం, 15 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ కేవలం 29 బంతుల్లో 97 పరుగులు చేసి సన్‌రైజర్స్ బౌలింగ్‌ను ఛిన్నాభిన్నం చేశాడు. కెప్టెన్ పాట్ కమిన్స్ వ్యూహాలేవీ అతడి ముందు ఫలించలేదు.

అనంతరం 244 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన హైదరాబాద్‌ను రాజస్థాన్ పేసర్ జోఫ్రా ఆర్చర్ తన పేస్ బౌలింగ్‌తో దెబ్బతీశాడు. పవర్‌ప్లేలోనే కీలక వికెట్లు కోల్పోయి హైదరాబాద్ ఒత్తిడిలో పడింది. నితీశ్‌రెడ్డి (38) కాసేపు పోరాడినా ఫలితం లేకపోయింది. చివరికి 192 పరుగులకే పరిమితమై ఎస్ఆర్‌హెచ్ ఓటమిని అంగీకరించింది.

కాగా, ఈ ఓటమి తర్వాత కావ్య మారన్‌పై సోషల్ మీడియాలో, ముఖ్యంగా చెన్నై సూపర్ కింగ్స్ (CSK) అభిమానుల నుంచి ట్రోలింగ్ మొదలైంది. లీగ్ దశలో చెన్నైపై గెలిచినప్పుడు కావ్య అతిగా సంబరాలు చేసుకున్నారని, "గెలిచినప్పుడు వినయంగా ఉండాలి" అంటూ పాత వీడియోలను షేర్ చేస్తూ చురకలు అంటిస్తున్నారు. టైటిల్ ఫేవరెట్‌గా బరిలోకి దిగిన హైదరాబాద్ ఇలా అనూహ్యంగా టోర్నీ నుంచి వైదొలగడం అభిమానులను తీవ్ర నిరాశకు గురిచేసింది.

# మీరు హెల్దీగానే ఉన్నారా? ఇలా తెలుసుకోండి?





మనం అన్ని విధాలా ఆరోగ్యంగానే ఉన్నామా? లేదా? ఏదైనా సమస్య ఉందా? అన్న విషయం మనం కొన్ని అంశాల ఆధారంగా తెలుసుకోవచ్చు. మనకు తీవ్ర అనారోగ్యం కలిగినప్పుడు మాత్రమే కొన్ని రకాల పరీక్షలు చేయించుకుంటూ ఉంటాం. అప్పుడే మనకు ఆరోగ్య సమస్యలు ఏమైనా ఉన్నాయా? అన్న విషయం తెలుస్తూ ఉంటుంది. అయితే మన శరీరంలో జరిగే కొన్ని మార్పుల ఆధారంగా మనం ఆరోగ్యంగా ఉన్నామా? లేదా? అన్న విషయం తెలుసుకోవచ్చు. అవేంటో ఈ కథనంలో తెలుసుకుందాం..

### జీర్ణవ్యవస్థ


మన ఆరోగ్యం విషయంలో జీర్ణ వ్యవస్థ ఎంతో కీలకం. మనం తిన్న ఆహారం సరిగ్గా జీర్ణం కాలేదంటే మనకు ఏదో జీర్ణ సంబంధిత వ్యాధి ఉన్నట్టు పరిగణించాలి. తిన్న తర్వాత గ్యాస్ పట్టినట్టు అనిపిస్తుంటే కచ్చితంగా జీర్ణ వ్యవస్థలో ఏదో ఇబ్బంది ఉన్నట్టే గుర్తించాలి. మనం తిన్న ఆహారం సరిగ్గా జీర్ణం అయితేనే మన శరీరానికి అన్ని రకాల పోషకాలు అందుతాయి.



### తగినంత నిద్ర

మనకు సరిగ్గా నిద్ర పట్టడం లేదంటే.. మనం డేంజర్ లో ఉన్నట్టే.. కాబట్టి కచ్చితంగా ప్రతి రోజు ఎనిమిది గంటల పాటు నిద్ర పోవాలని వైద్యులు సూచిస్తున్నారు. దీంతోపాటూ నిద్ర రాకపోయినా సమస్యగానే పరిగణించాలి. ఆరోగ్యంగా ఉన్నవారు మంచి నిద్రను పొందుతారు. రాత్రి నిద్ర తర్వాత రిఫ్రెష్, విశ్రాంతిని పొందుతారని ఆరోగ్య నిపుణులు అంటున్నారు. శరీరానికి మంచి నాణ్యమైన నిద్ర లభిస్తే.. అది మంచి శారీరక, మానసిక ఆరోగ్యానికి సంకేతంగా పరిగణించబడుతుంది.





### సౌకర్యవంతమైన ప్రేగు కదలికలు

మూత్రవిసర్జన వలె, ప్రేగు కదలికలపై కూడా శ్రద్ధ చూపడం చాలా ముఖ్యం. సాధారణ, సౌకర్యవంతమైన ప్రేగు కదలికలు మెరుగైన జీర్ణక్రియకు సంకేతంగా పరిగణించబడతాయి. రోజుకు ఒకటి లేదా రెండుసార్లు ప్రేగు కదలికలను కలిగి ఉండటం సాధారణమైనదిగా పరిగణించబడుతుంది. మలం విసర్జించడంలో ఎలాంటి ఇబ్బంది లేకపోయినా, మలవిసర్జన తర్వాత ఖాళీగా అనిపిస్తే అది మంచి ఆరోగ్యానికి సంకేతం.

### మూత్రం రంగు

మనం ఆరోగ్యంగా ఉన్నామా? లేదా? అన్న విషయం మన మల, మూత్రాల రంగును చూస్తే అర్థమవుతుంది. ఉన్నామో లేదో తెలుసుకోవడానికి.. మలం, మూత్రంపై శ్రద్ధ చూపడం చాలా ముఖ్యం. లేత పసుపు మూత్రం సాధారణంగా మీరు బాగా హైడ్రేట్ గా ఉన్నారని సూచిస్తుంది. ఇది కిడ్నీ రికవరీకి సంకేతంగా కూడా పరిగణించబడుతుంది. మూత్రం గట్టిపడటం లేదా రంగులో మార్పు కనిపిస్తే, జాగ్రత్తగా ఉండాలి.



### బరువును నియంత్రించడం:

అనేక రకాల వ్యాధులను నివారించడానికి బరువును అదుపులో ఉంచుకోవడం చాలా అవసరం. మీ శరీర ఎత్తును బట్టి మీ బరువు సరిగ్గా ఉంటే అది మంచి ఆరోగ్యానికి సంకేతం. మీ బరువు తక్కువ సమయంలో వేగంగా పెరుగుతూ లేదా తగ్గుతూ ఉంటే, జాగ్రత్తగా ఉండాలి. బరువు అసమతుల్యత అనేక రకాల దీర్ఘకాలిక వ్యాధులకు కారణమవుతుంది.





### మంచి మానసిక ఆరోగ్యం:

శారీరక ఆరోగ్యంలాగే, మానసిక ఆరోగ్యాన్ని జాగ్రత్తగా చూసుకోవడం చాలా ముఖ్యం. మీరు తక్కువ ఒత్తిడికి లోనవుతుంటే, మీ మనస్సు ప్రశాంతంగా ఉంటుంది. చిరాకు, భయం వంటి సమస్యలు ఉండవు. అది మంచి మానసిక ఆరోగ్యానికి సంకేతం. శారీరక మరియు మానసిక ఆరోగ్యం ఒకదానికొకటి సంపూర్ణంగా ఉంటాయని ఇక్కడ గమనించడం ముఖ్యం. వీటిలో ఏదైనా ఒకదానిలో ఆటంకం మొత్తం శరీరంపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతుంది.



### గాయాలను త్వరగా నయం చేయడం

శరీరంపై గాయం లేదా గాయం ఎంత త్వరగా నయం అవుతుందనే దాని ఆధారంగా కూడా ఆరోగ్యాన్ని అంచనా వేయవచ్చు. గాయాలు త్వరగా మానితే మన రోగనిరోధక వ్యవస్థ బాగానే ఉందనడానికి సంకేతం. మధుమేహం వంటి వ్యాధులలో రోగనిరోధక శక్తి బలహీనపడటం వల్ల గాయాలు మానడానికి చాలా సమయం పడుతుంది. వీటితో పాటు మనం తరుచూ అనారోగ్యానికి గురవుతున్నామంటే కచ్చితంగా డాక్టర్ ను సంప్రదించి అన్ని పరీక్షలు చేయించుకోవాలి.

# ఉలవలతో ఇన్ని లాభాలా?




ఉలవచారు, ఉలవచారు బిర్యాని ఇప్పుడు ఎంతో ఫేమస్. అయితే ఉలవలతో అనేక ఆరోగ్యప్రయోజనాలు ఉన్నాయి. అందుకే వీటితో ఇప్పుడు రకరకాల వంటలు చేస్తున్నారు. భారత దేశంలోని ఉష్ణమండల వాతావరణాల్లో ఈ ఉలవలు పెరుగుతాయి. వీటిలో అనేక రకాలైన పోషకాలు ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు. ప్రోటీన్, ఫైబర్, విటమిన్లు, ఖనిజాలు ఇందులో పుష్కలంగా ఉంటాయి. ఆరోగ్యం కోసం ప్రతి ఒక్కరు ఉలవలను తమ ఆహారంలో భాగం చేసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. ఎర్రటి, గోధుమ రంగు పప్పుధాన్యాలు అవసరమైన పోషకాలతో నిండి ఉంటాయి. వీటిని శతాబ్దాలుగా సాంప్రదాయ వైద్యంలో వివిధ రకాల రోగాలకు చికిత్స చేయడానికి ఉపయోగించబడుతున్నాయి.

### ప్రోటీన్ పుష్కలంగా..

ఉలవల్లో ప్రొటీన్ పుష్కలంగా ఉంటుంది. కండరాల పెరుగుదలకు, మరమ్మతుగా ప్రొటీన్ ఎంతగానో ఉపయోగపడుతుంది. శాకాహారులకు ప్రొటీన్ అందజేసే ఆహారాల్లో ఉలవలు కూడా ఎంతో కీలకం. ఇక ఉలవల్లో ఫైబర్ కూడా అధికంగానే ఉంటుంది. ఇది జీర్ణక్రియకు సహాయపడుతుంది. ఇంకా రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రిస్తుంది. ఆరోగ్యకరమైన గట్ మైక్రోబయోమ్ ను నిర్వహించడంలో ఫైబర్ కూడా కీలక పాత్ర పోషిస్తుంది. పోషకాలు అధికంగా ఉండే ఉలవల్లో కేలరీలు తక్కువగా ఉంటాయి. ఇది బరువు నిర్వహణ, మొత్తం ఆరోగ్యానికి గొప్ప ఆహారంగా మారుతుంది. ఉలవల్లో యాంటీ డయాబెటిక్ లక్షణాలు ఉన్ఆనయి. అవి రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రిస్తాయని అధ్యయనాలు నిరూపించాయి.

### గుండె ఆరోగ్యం పదిలం

ఉలవలు కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గిస్తాయి. గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గిస్తాయి. దాని అధిక ఫైబర్ కంటెంట్, యాంటీఆక్సిడెంట్ లక్షణాల కారణంగా గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. ఉలువలలో ఉండే ఐరన్, మెగ్నీషియం, విటమిన్ సీ వంటి విటమిన్లు, ఖనిజాలు రోగనిరోధక శక్తిని పెంచుతాయి.





# కాకరతో ఇన్ని ప్రయోజనాలా? తెలిస్తే అస్సలు వదలరు..!

కాకరకాయ ఈ కూరగాయ పేరు చెప్పగానే చాలా మంది నిట్టూరుస్తారు. తప్పనిసరి పరిస్థితుల్లో మాత్రమే కాకరను తప్పదన్నట్టు తింటుంటారు. అయితే కాకరకాయతో అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని ఆహారరంగ నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా షుగర్ వ్యాధి గ్రస్తులకు కాకరకాయ ఓ సంజీవని లాంటిది. చక్కెర స్థాయిలను కాకర కంట్రోల్ చేస్తోంది. బరువు తగ్గడంలోనూ తోడ్పడుతుంది. జీర్ణ వ్యవస్థను కూడా మెరుగుపరుస్తుంది.

### కాకరరసంతో లాభాలు ఇవే..!

కాకరకాయ జ్యూస్ తరుచూ తీసుకోవడం వల్ల జీర్ణ సంబంధిత వ్యాధులకు దూరం కావొచ్చట. జీర్ణ వ్యవస్థను మెరుగుపరచడంలో కాకర కాయ రసం ఎంతగానో ఉపయోగపడుతుంది. ప్రస్తుత కాలంలో ప్రతి నలుగురిలో ఒకరు జీర్ణ సంబంధిత సమస్యతో ఇబ్బందిపడుతున్నారు. ముఖ్యంగా కాకర కాయ రసాన్ని ఖాళీ కడుపుతో తాడగం వల్ల శరీరంలోని సమస్యలు తొలగిపోయి జీర్ణ సంబంధిత సమస్యలు తగ్గుతాయని వాతావరణ నిపుణులు చెబుతున్నారు.

### బరువు నియంత్రణ:

పెరిగిన బరువుతో చాలా మంది ఆందోళన చెందుతున్నాయి. అలాంటి వారు కాకర కాయ రసం తాగితే చాలా ప్రయోజనాలు ఉంటాయి. ఫైబర్ అధికంగా ఉండే కాకర కాయ రసం బరువు తగ్గించడంలో సహాయపడుతుంది. అంతే కాకుండా కాకర రసం తాగడం వల్ల ఆకలి నియంత్రణలో ఉంటుంది. ఇది బరువు తగ్గడానికి ఎంతో సహాయపడుతుంది.

### ఇమ్యూనిటీ బూస్టర్.. !

ప్రస్తుత వర్షా కాలంలో జనం అనేక రోగాల బారిన పడుతున్నారు. సరైన ఇమ్యూనిటీ లేకపోవడం వల్లే వ్యాధుల బారిన పడుతున్నారు. అయితే కాకర రసం తరుచూ తీసుకోవడం.. లేదంటే కాకరకాయలను కూర చేసుకొని తినడం వల్ల ఇమ్యూనిటీ పెరుగుతుందని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. కాకరకాయలో విటమిన్ సి, యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉన్నాయి. ఇవి రోగనిరోధక శక్తినిపెంచుతాయి.

### చర్మానికి మేలు:

కాకర కాయ రసం చర్మానికి ఎంతో మేలు చేస్తుంది. కాకర కాయలో యాంటీఆక్సిడెంట్లు ఉంటాయి . ఇవి చర్మాన్ని ఫ్రీ రాడికల్స్ నుంచి రక్షించి కాంతివంతగా చేస్తాయి. కాకర కాయ రసాన్ని క్రమం తప్పకుండా తాగడం వల్ల చర్మానికి కొత్త మెరుపు వస్తుంది. అంతే కాకుండా దీని వల్ల చర్మం ఆరోగ్యంగా ఉంటుంది.



వేరే పరిశ్రమకి వెళ్లినప్పుడు అక్కడి స్థానిక భాష మాట్లాడటం చాలా ముఖ్యమని, ఇదంతా పబ్లిసిటీ కోసం కాదని అంటోంది అందాల తార శ్రీలీల. భాషతో సంబంధం లేకుండా ప్రేక్షకుల్ని అలరించే ఈ భామ.. తన డ్యాన్స్‌తో కుర్రకారుని ఉర్రూతలూగిస్తోంది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఈమె వివిధ ప్రాంతాల ప్రేక్షకులతో కనెక్ట్ అవ్వడం గురించి మాట్లాడింది. “నా విషయానికొస్తే… నేను ప్రతి భాషను గౌరవిస్తాను. పలు చిత్రపరిశ్రమల్లో అవకాశాలు అందుకుంటూ పనిచేస్తున్నా… కాబట్టి ఒక ప్రాంతానికి వెళ్లినప్పుడు తప్పకుండా అక్కడి భాషలోనే మాట్లాడతా. ఆ ప్రదేశానికి, అక్కడి భాషకు, ప్రజలకు ఇచ్చే గౌరవం అది. సినీతారలకు, ప్రేక్షకులకు మధ్య భాష ఒక భావోద్వేగ వారధిలాగా ఉంటుంది. అందుకే ప్రచార కార్యక్రమాల్లో స్థానిక భాషల్లో మాట్లాడటం వల్ల వారి మధ్య దూరం తగ్గుతుందనేది నా అభిప్రాయమ”ని చెప్పుకొచ్చింది. ప్రస్తుతం ఆమె హిందీలో కార్తిక్ ఆర్యన్‌తో ఓ ప్రేమకథా చిత్రంతో పాటు ధనుష్ నటిస్తున్న మరో సినిమాలో నాయికగా నటిస్తుంది

# ఇదంతా పబ్లిసిటీ కోసం కాదు!

# ఈ ప్రయాణంలో మీకు మీరే స్నేహితులు

కళా రంగమే కాదు.. మీరు ఎంచుకున్న ఏ ప్రపంచంలోనైనా మీ ప్రయాణం వ్యక్తిగతమైనదే అంటోంది కథానాయిక ఐశ్వర్య రాయ్. ఇటీవలే ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆమె చిత్రపరిశ్రమలో రాణించాలనుకున్నప్పుడు వ్యక్తిత్వానికి ఇవ్వాల్సిన ప్రాధాన్యత గురించి తన అభిప్రాయాన్ని పంచుకుంది. “నటిగా ఇప్పటికీ ప్రతిరోజు కొత్తగానే భావిస్తాను. సృజనాత్మకతతో కూడిన ఈ ప్రపంచంలో మనల్ని మనం వెతుక్కునే నిరంతర ప్రయాణం ఇది. అలాంటిది ఎవరికో సలహాలు ఇచ్చేంత గొప్ప స్థానంలో నేను ఉన్నానని అనుకోను. ప్రేక్షకులు నాపై చూపే ప్రేమ, ఆదరాభిమానాలకు ఎల్లప్పుడూ కృతజ్ఞురాలినే. కానీ, కళా రంగమే కాదు.. ఎంచుకున్న ఏ ప్రపంచంలోనైనా మీ ప్రయాణం వ్యక్తిగతమైనది. మీ అనుభవాలే మీకు జీవితంలో ఎలాంటి నిర్ణయాలు తీసుకోగలరో తెలుసుకునేందుకు సహాయపడతాయి. ఎందుకంటే ఒక్కొక్కరిది ఒక్కో రకమైన దృష్టి కోణం. నేను చెప్పాలని అనుకున్నదల్లా ఒక్కటే.. ఇప్పుడున్న పరిస్థితుల్లో మీ చుట్టూ ఏం జరుగుతుందో మీరు ఊహించలేరు. ప్రతి విషయాన్ని ఒక ప్రణాళికతో కృత్రిమంగా చేయడానికే ఎక్కువ మంది ఇష్టపడుతున్నారు. నిజమో కాదో తెలుసుకునేలోపే అంతా జరిగిపోతుంది. యువతరం ఇలాంటి వాటిని చూసి పక్కదారి పట్టకూడదు. బయటకు వెళ్లండి. మీ అభిరుచిని తెలుసుకోండి. మీ నిర్ణయాలతో నిజాయతీగా మెలగండి. ఆ ప్రయాణంలో మీకు మీరే మంచి స్నేహితులుగా నిలబడాలి. ఈ నకిలీ ప్రపచంలో ఫన్, మ్యాజిక్‌లతో పాటు ఒక వ్యక్తి ఏం చేయగలడో అనే వాటిని అన్వేషించేడంలో ఆనందం ఉండదు. ముందు సజీవంగా ఉండి జీవితాన్ని అర్థం చేసుకోవాలి. ఆ తర్వాత ఆ అనుభూతిని మీ కళలోకి తీసుకురావాలి. మీరు ఎవరనే దానికి నిజాయతీగా ఉండండి. అలానే నిత్య విద్యార్థిగా ఉంటూ మీతో మీరు నిజాయతీగా ఉండండి. సొంత అనుభవాలే మిమ్మల్ని ఒక మంచి నటుడిగా తీర్చిదిద్దుతాయి. వాటన్నింటినీ స్వీకరిస్తూ మీ ప్రయణాన్ని సాగించాలి. మిగిలినవన్నీ జరగాల్సిన సమయానికి అవే జరిగిపోతాయి, రావాల్సినవి వస్తాయి” అని చెప్పింది.



# ‘పెద్ది’ పైరసీకి అడ్డుకట్ట.. మద్రాస్ హైకోర్టు కీలక ఉత్తర్వులు

‘పెద్ది’ సినిమా పైరసీకి అడ్డుకట్ట వేసేందుకు మద్రాస్ హైకోర్టు కీలక ఉత్తర్వులిచ్చింది. ఈ సినిమాకు యాంటీపైరసీ ఇంజంక్షన్ జారీ చేసింది. సినిమా కాపీరైట్‌కు సంబంధించి చిత్ర నిర్మాణ సంస్థ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారించిన హైకోర్టు వెకేషన్ బెంచ్ ఈ మేరకు మధ్యంతర ఉత్తర్వులిచ్చింది. ఈ సినిమాను (Peddi) ఇంటర్నెట్‌లో అక్రమంగా అప్‌లోడ్ చేయడం, ప్రసారం చేయడం, కాపీ చేయడాన్ని నిరోధిస్తూ న్యాయస్థానం ఈ ఆదేశాలిచ్చింది. సినిమా అనధికారికంగా ఇంటర్నెట్‌లో లీక్ అయితే నిర్మాతలకు భారీ నష్టం వాటిల్లుతుందని కోర్టు ఈ సందర్భంగా అభిప్రాయపడింది. ‘యాంటీ పైరసీ ఇంజంక్షన్’ (AntiPiracy Injunction) అనేది కాపీరైట్ హక్కుదారులు తమ కంటెంట్ (సినిమాలు, వెబ్‌సిరీస్‌లు) అక్రమంగా కాపీ కాకుండా, పైరసీ వెబ్‌సైట్లలో ప్రసారం కాకుండా కోర్టుల ద్వారా పొందే ఒక న్యాయపరమైన రక్షణ ఉత్తర్వు. ఒక వెబ్‌సైట్‌ను బ్లాక్ చేసిన వెంటనే, కొత్త యూఆర్‌ఎల్‌తో అదే కంటెంట్ రాకుండా కొత్త సైట్‌లను కూడా ఆటోమేటిక్‌గా బ్లాక్ చేయడానికి ఈ ‘డైనమిక్ ఇంజంక్షన్’ (Dynamic Injunction) ఉత్తర్వులను కోర్టులు జారీ చేస్తుంటాయి.

గతకొంత కాలంగా ఇండస్ట్రీని పైరసీ భూతం వెంటాడుతోన్న విషయం తెలిసిందే. ఇటీవల కూడా విజయ్ ‘జననాయగన్’ విడుదలకు ముందే నెట్టింట ప్రత్యక్షమైంది. ఇలాంటివి జరగకుండా ‘పెద్ది’ టీమ్ ముందడుగు వేయడంపై అందరూ హర్షం వ్యక్తం చేస్తున్నారు. రామ్ చరణ్ (Ram Charan) హీరోగా బుచ్చిబాబు దర్శకత్వంలో తెరకెక్కిన ‘పెద్ది’ జూన్ 4న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇప్పటికే విడుదలైన ట్రైలర్, పాటలు దీనిపై అంచనాలు పెంచేశాయి.






## స్వాతంత్ర్య దినోత్సవం స్పెషల్‌గా రాబోతున్న ‘విశ్వనాథ్ అండ్ సన్స్’..

తమిళ స్టార్ హీరో సూర్య తన కెరీర్‌లో తొలిసారిగా 'విశ్వనాథ్ అండ్ సన్స్'తో పూర్తి స్థాయి తెలుగు చిత్రంలో నటిస్తున్న విషయం తెలిసిందే. వెంకీ అట్లూరి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ మూవీలో మమితా బైజు హీరోయిన్ కాగా.. రవీనా టాండన్, రాధికా శరత్‌కుమార్ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. తాజాగా ఈ సినిమా విడుదల తేదీని ఫిక్స్ చేస్తూ అధికారిక ప్రకటన రిలీజ్ చేశారు మేకర్స్. ‘ప్రియమైన అభిమానులారా.. ఈ వేడుకలను ఇలాగే కొనసాగించడానికి మా దగ్గర అదిరిపోయే అప్డేట్ ఉన్నది. విశ్వనాథ్ అండ్ సన్స్ కోసం దారి ఇవ్వండి.. ఆగస్టు 14, 2026న ప్రపంచవ్యాప్తంగా ఉన్న థియేటర్లను జయించడానికి వస్తున్నారు’ అంటూ అదిరిపోయే పోస్టర్‌ను షేర్ చేశారు. విడుదల చేసిన పోస్టర్‌లో సూర్య చేతిలో గొడుగు, ఫోన్ పట్టుకుని సీరియస్ అండ్ స్టైలిష్ లుక్‌లో కనిపిస్తూ ఫ్యాన్స్‌ను ఫిదా చేస్తున్నాడు. ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవం, అలాగే వీకెండ్స్ కావడంతో ఈ సెలవులు సినిమా సక్సెస్‌కు మరింత ప్లెస్ అయ్యే అవకాశం ఉన్నట్లు ఖుష్ అవుతున్నారు అభిమానులు. ఇప్పటికే ఇందులో నుంచి వచ్చిన అప్డేట్స్ ఆకట్టుకోవడంతో పాటు.. తెలుగులో సూర్య మొదటి చిత్రం కావడంతో ఫ్యాన్స్‌తో పాటు ప్రేక్షకుల్లో కూడా ‘విశ్వనాథ్ అండ్ సన్స్’పై భారీ అంచనాలు ఉన్నాయి. కాగా.. జీవీ ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రాన్ని సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్లు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి.



‘బలగం’ వంటి బ్లాక్‌బస్టర్ సినిమాతో జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్న దర్శకుడు వేణు యెల్దండి తెరకెక్కిస్తున్న లేటెస్ట్ ప్రాజెక్ట్ ‘ఎల్లమ్మ’. రాక్‌స్టార్ దేవి శ్రీ ప్రసాద్ ఈ చిత్రంతో హీరోగా పరిచయం అవుతున్నాడు. దీంతో టాలీవుడ్‌లో ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. దిల్ రాజు ఈ సినిమాను ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. అయితే, ఈ సినిమాలో హీరోయిన్ మాత్రం ఇంకా ఫైనల్ కాలేదు. గతంలో పలువురు ముద్దుగుమ్మల పేర్లు వినిపించగా.. కీర్తి సురేష్ ఆల్మోస్ట్ ఫైనల్ అయిందని అన్నారు. ఇటీవల మృణాల్ ఠాకూర్‌ను సంప్రదించినట్లు వార్తలు వచ్చాయి. ‘సీతారామం’, ‘హాయ్ నాన్న’ చిత్రాలతో తెలుగులో మంచి గుర్తింపు తెచ్చుకున్న మృణాల్.. ఈ ఎమోషనల్ రోల్‌కు పర్‌ఫెక్ట్‌గా సెట్ అవుతుందని మేకర్స్ భావించారు. దీనిపై ఆమెతో చర్చలు కూడా జరిగాయని అన్నారు. కానీ ఇప్పుడు ఈ ప్రెస్టీజియస్ ప్రాజెక్ట్‌లో యంగ్ సెన్సేషన్ మమితా బైజు పేరు వినిపిస్తోంది. ‘ప్రేమలు’ సినిమాతో తెలుగు ప్రేక్షకులకు దగ్గరైన ఈ యంగ్ బ్యూటీ.. ప్రస్తుతం వరుస ప్రాజెక్ట్‌స్‌తో దూసుకుపోతోంది. ఈ నేపథ్యంలో.. ఎల్లమ్మలో మమిత ఛాన్స్ దక్కించుకున్నట్టుగా సమాచారం. ప్రస్తుతానికి మేకర్స్ ఆమెతో సంప్రదింపులు జరుపుతున్నట్లు టాక్. ఒకవేళ అంతా అనుకున్నట్లు జరిగితే, డీఎస్‌పీ సరసన మమితా బైజు జోడీ కట్టడం ఖాయంగా కనిపిస్తోంది. ఈ క్రేజీ కాంబినేషన్‌పై త్వరలోనే అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉంది. ప్రస్తుతానికి మాత్రం ఎల్లమ్మ ఎవరు అనేది సస్పెన్స్‌లోనే ఉంది.

# ‘ఎల్లమ్మ’ కోసం యంగ్ సెన్సేషన్?




## వారణాసి కోసం మహేష్ భారీ రిస్క్.. ఏకంగా నెల రోజుల పాటు నరకమే !

ప్రిన్స్ మహేష్ బాబు లేటెస్ట్ గా నటిస్తున్న సినిమా వారణాసి. రాజమౌళి దర్శకత్వంలో ఈ సినిమా తెరకెక్కుతోంది. పాన్ ఇండియా రేంజ్ లో వస్తున్న ఈ మూవీ.. టైం ట్రావెల్, మైథాలజీ కాన్సెప్ట్ తో వస్తున్నట్లు టాక్ నడుస్తోంది. ఈ సినిమాలో మహేష్ బాబు రుద్ర అనే శివ భక్తుడి పాత్రలో మెరువనున్నారు. ఇప్పటికే ఈ సినిమా టైటిల్ టీజర్ రిలీజ్ కాగా, అందరినీ ఆకట్టుకుంది. ప్రస్తుతం శరావేగంగా ఈ సినిమా షూటింగ్ జరుగుతోంది.

ఇలాంటి క్రమంలో ఈ మూవీ నుంచి అదిరిపోయే అప్డేట్ వచ్చేసింది. ఈ సినిమా షూటింగ్ లో భాగంగా వచ్చే నెల మొదటి వారం నుంచి ఓ యాక్షన్ షెడ్యూల్ ప్రారంభం కాబోతుందట. ఈ 30 రోజుల పాటు నాన్ స్టాప్ గా యాక్షన్స్ షూట్ జరగనున్నట్లు టాక్ నడుస్తోంది. ప్రతిరోజు మహేష్ బాబు హాజరు కాబోతున్నట్లు సమాచారం. అంటే ఈ నెల రోజుల పాటు మహేష్ బాబు యాక్షన్ మోడ్ లో ఉంటాడన్నమాట. ఈ యాక్షన్ సీన్ సినిమాకు హైలెట్ గా నిలుస్తుందని కూడా అంటున్నారు. దీంతో మహేష్ బాబు ఫ్యాన్స్ ఫిదా అయిపోతున్నారు.

## ఫ్యాన్స్ వార్ సృష్టించడం వల్ల జరిగేదేం ఉండదు..

సెలబ్రిటీలకు ఫ్యాన్స్ ఉండటం చాలా కామన్. అయితే.. కొందరు ఫ్యాన్స్ మాత్రం మా హీరో / హీరోయిన్ గొప్పా అంటే మా వాళ్లు గొప్పా అంటూ సోషల్ మీడియాలో వార్ సృష్టిస్తుంటారు. తాజాగా ఇలాంటి సంఘటనే బాలీవుడ్ బ్యూటీ ఊర్వశి రౌతేలాకు ఎదురైంది. ఏఐ ద్వారా సృష్టించిన ఓ ఫొటోలో ఐశ్వర్యరాయ్‌ను గ్లోబల్ బ్యూటీగా, ఆ తర్వాత కేటగిరిలో దీపిక పదుకొణె, ప్రియాంక చోప్రా, మాధురీ దీక్షిత్ ఉన్నారు. ఇక వాళ్ల ముందు మోకరిల్లి పాదాలు నమస్కరిస్తున్నట్లుగా నటి ఊర్వశితో పాటు ఆలియా భట్, కరీనా కపూర్, కత్రినా కైఫ్ ఉన్నారు. ప్రస్తుతం ఈ ఏఐ ఫొటో వైరల్ అవుతుండగా ఊర్వశి దానిపై ఘాటుగా స్పందించింది. ఈ మేరకు తన సోషల్ మీడియా వేదికగా ఓ పోస్ట్ షేర్ చేస్తూ.. ‘ప్రతి నటికి తనకంటూ సొంత జర్నీ ఉంటుంది. ఆ జర్నీలో ఎంతో కష్టపడుతుంది. అలాంటి మహిళల్ని పోలుస్తూ ఫ్యాన్ వార్ సృష్టించడం వల్ల జరిగేది ఏం ఉండదు. అది కేవలం నెగిటివిటీని వ్యాప్తిచేయడం మాత్రమే అవుతుంది. దానికి బదులుగా టాలెంట్‌ను గుర్తించండి, వారి ఎదుగుదలను ప్రోత్సహించండి. దయతో ప్రవర్తించడం నేర్చుకోండి. ఇలా విషం చిమ్మడం ఆపేయండి’ అంటూ చెప్పుకొచ్చింది. ప్రస్తుతం ఈమె పోస్ట్ వైరల్ అవుతుండగా.. తనకు సపోర్ట్‌గా నిలిస్తూ.. ‘ఎవరి ప్రతిభ వాళ్లది.. ఎవరిని కించపరచొద్దు’ అంటూ కామెంట్స్ చేస్తున్నారు నెటిజన్లు.



The imprint line should be printed legibly as Printed by Published by BADHE JAYASHREE on behalf of BADHE JAYASHREE, printed at and published at PLOT NO. 104, KAPIL KAUSALYA APARTMENT, SHILPA CERENY COUNTY VENCHER, POTHIREDDYPALLY editor BADHE JAYASHREE.